RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 35 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ బుధవారం 13-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



2వ పేజీలో...

యువ లాయర్ల పట్ల సహనంతో..

## ఉండండి

**జడ్జిలకు సుప్రీంకోర్టు హితవు**

- యువ న్యాయవాదుల పట్ల సహనంతో ఉండాలని జడ్జిలకు సుప్రీంకోర్టు సూచన
- ఏపీ హైకోర్టులో లాయర్‌ను కస్టడీకి పంపిస్తానన్న ఘటనపై స్పందన
- వివాదం సామరస్యంగా పరిష్కారం కావడంతో కేసును మూసివేసిన ధర్మాసనం
- వివాదాల పరిష్కారానికి గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని హైకోర్టులకు ఆదేశం
- కోర్టు విచారణల వీడియోలపై మీడియా బాధ్యతతో ఉండాలని వ్యాఖ్య

ఢిల్లీ,: న్యాయమూర్తులు ముఖ్యంగా యువ న్యాయవాదుల పట్ల సహనం, దయాభావంతో వ్యవహరించాలని, వారిని ప్రోత్సహించాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇటీవల ఓ యువ న్యాయవాదిని ఉద్దేశించి జడ్జి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ జోక్యంతో వివాదం సామరస్యంగా పరిష్కారమైనందున ఈ కేసును తాము మూసివేస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం..

# సహించం



- సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు
- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్, మే12 : ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు.





నీట్ ప్రవేశ పరీక్ష

## రద్దు

2వ పేజీలో...

**పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి**

న్యూఢిల్లీ,మే12 : జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది.

వలసదారులకు, టారిఫ్ లకు లింకు పెట్టిన

## ట్రంప్

- రికార్డు స్థాయిలో 2 లక్షల మంది నేరస్థులను అరెస్ట్ చేశామని ప్రకటన
- గత 12 నెలల్లో 6 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులను బహిష్కరించినట్టు వెల్లడి
- ఫెంటనిల్ డ్రగ్ స్మగ్లింగ్ 60 శాతం మేర తగ్గిపోయిందని తెలిపిన ట్రంప్
- అమెరికా చట్ట అమలు సంస్థలను గొప్ప దేశభక్తులుగా కొనియాడిన అధ్యక్షుడు

2వ పేజీలో...

వాషింగ్టన్: అక్రమ వలసదారుల విషయంలో తమ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అమెరికా నుంచి బహిష్కరించిన తమ దేశ పౌరులను వెనక్కి తీసుకునేందుకు నిరాకరించిన దేశాలను టారిఫ్‌లతో (సుంకాలతో) హెచ్చరించామని, దాంతో అవి వెంటనే దారికి వచ్చాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.





2వ పేజీలో...

'నీట్' పరీక్ష లీకేజీపై స్పందించిన

## రాహుల్ గాంధీ

**22 లక్షల మంది విద్యార్థుల కష్టాన్ని, కలలను ఛిన్నాభిన్నం చేశారని ఆగ్రహం**
**పిల్లల కోసం తల్లిదండ్రులు రుణాలు తీసుకున్నారని, బంగారం అమ్మేశారన్న రాహుల్ గాంధీ**
**కేవలం వైఫల్యం కాదు విద్యార్థుల భవిష్యత్తుపై జరిగిన నేరమన్న రాహుల్ గాంధీ**

ఢిల్లీ,: వైద్య విద్య జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్-యూజీ) 2026కు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలపై లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. దాదాపు 22 లక్షలమంది నీట్ పరీక్షను రాశారని గుర్తు చేశారు. ఆ విద్యార్థులు పడిన కష్టాన్ని, వారి కలలను బీజేపీ సారథ్యంలోని అవినీతి వ్యవస్థ ఛిన్నాభిన్నం చేసిందని ఆయన 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. నీట్ పరీక్ష రద్దయిందని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల కోసం కొందరి తండ్రులు రుణాలు తీసుకున్నారని, మరికొందరి తల్లులు బంగారం అమ్మేశారని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో నిద్రలేని రాత్రులు కష్టపడి చదివితే, వారికి దక్కిన ప్రతిఫలం 'పేపర్ లీకేజీ-పరీక్ష రద్దు' అని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి పేపర్ లీకేజీకి నిదర్శనమని మండిపడ్డారు.

హైదరాబాద్, మే12 : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించినవస్తువులు కాదన్నారు.

2వ పేజీలో...



## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

- బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్



హైదరాబాద్‌లో బాలుడిపై..

## వీధికుక్కల దాడి

**పరిస్థితి విషమం**

- ఆడుకుంటుండగా విరుచుకుపడిన 10 శునకాలు
- తలకు తీవ్ర గాయాలు, విషమంగా బాలుడి పరిస్థితి
- అధికారులు పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో వీధికుక్కలు మరోసారి బీభత్సం సృష్టించాయి. ఇంటి బయట ఆడుకుంటున్న ఓ చిన్నారిపై సుమారు 10 వీధికుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రస్తుతం బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ దారుణ ఘటన బీఎన్ రెడ్డి నగర్ సమీపంలోని టీచర్స్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

2వ పేజీలో...







2వ పేజీలో...

తమిళ సిఎం విజయ్ సంచలన

## నిర్ణయం

- బడులు, గుడులు,బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ

చెన్నై, మే12 : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.



2వ పేజీలో...

నగరంలో మూడు చోట్ల

## చైన్ స్నాచింగ్‌లు

**ఆందోళనలో స్థానిక ప్రజలు**

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం



మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి...

చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామిలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# వలసదారులకు, టారిఫ్ లకు లింకు పెట్టిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి...



నిన్న వైట్‌హౌస్‌లో 'పోలీస్ వీక్' సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "నేను అధికారం చేపట్టినప్పటి నుంచి మా ప్రభుత్వం దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో దాదాపు 2 లక్షల మంది నేరస్థులను అరెస్ట్ చేసింది. వారిని వీధుల నుంచి ఏరివేసి జైళ్లలో పెడుతున్నాం లేదా చాలా సందర్భాల్లో వారు వచ్చిన దేశాలకే తిరిగి పంపిస్తున్నాం. కొన్నిసార్లు వారి దేశాలు, 'మాకు వాళ్లు వద్దు, వారిని తీసుకోము' అని చెబుతాయి. అప్పుడు నేను, 'సరే, మీ దేశంపై 25% టారిఫ్‌లు విధిస్తాం' అని చెబుతాను. వెంటనే వారు ఫోన్ చేసి, 'వారిని తిరిగి పంపండి, సంతోషంగా స్వీకరిస్తాం' అని చెబుతారు" అని వివరించారు. ఈ పద్ధతి అద్భుతంగా పనిచేసిందని ఆయన అన్నారు. గత 12 నెలల కాలంలో హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం సుమారు 6,15,000 మంది అక్రమ వలస నేరస్థులను దేశం నుంచి బహిష్కరించిందని ట్రంప్ తెలిపారు. అలాగే, దేశ దక్షిణ సరిహద్దు ద్వారా ఒక్క అక్రమ వలసదారుడిని కూడా దేశంలోకి అనుమతించలేదని ఆయన పేర్కొన్నారు. అమెరికాను పట్టిపీడిస్తున్న ఫెంటనిల్ డ్రగ్ స్మగ్లింగ్ గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. సరిహద్దుల గుండా జరిగే ఫెంటనిల్ సరఫరా 60 శాతానికి పైగా తగ్గిపోయిందని, సముద్ర మార్గం ద్వారా వచ్చే స్మగ్లింగ్ 97 శాతం పడిపోయిందని వెల్లడించారు. ఈ విజయాలన్నీ అమెరికా చట్ట అమలు సంస్థల వల్లే సాధ్యమయ్యాయని ప్రశంసించారు. ఐసీఈ, హోంల్యాండ్ సెక్యూరిటీ, యూఎస్ మార్షల్స్, ఏటీఎఫ్, ఎఫ్‌బీఐతో పాటు రాష్ట్ర, స్థానిక పోలీసుల సేవలను కొనియాడారు. వారందరూ అద్భుతమైన దేశభక్తులని, గొప్ప వ్యక్తులని ట్రంప్ కితాబిచ్చారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు



దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ

మొదటిపేజీ తరువాయి...

విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

మొదటిపేజీ తరువాయి...

స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు.



ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

### పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్,మే12 :దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## 'నీట్' పరీక్ష లీకేజీపై స్పందించిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి...

ఇది కేవలం వైఫల్యం కాదని, యువత భవిష్యత్తుపై జరిగిన నేరమని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్ష లేకుండా తప్పించుకుంటోందని అన్నారు. కానీ విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీ కారణంగా విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోందని అన్నారు. ప్రధాని మోదీ చెబుతోన్న అమృత్ కాలం దేశానికి విషమయంగా మారిందని అన్నారు.

## బీదర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### బైకును ఢీకొని బోల్తాపడ్డ కర్నారటక ఆర్టీసీ బస్సు

### ప్రమాదంలో ముగ్గురు మృతి...ఇద్దరు సంగారెడ్డి వాసులు

సంగారెడ్డి,మే12 : కర్ణాటకలోని బీదర్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై వెళ్తున్న బైక్‌ను కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ఢీ కొట్టింది. అనంతరం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బీదర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు సంగారెడ్డి జిల్లా వాసులు ఉన్నారని పోలీసులు వివరించారు. బీదర్ నుంచి ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

### 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

హైదరాబాద్,మే12 : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

## యువ లాయర్ల పట్ల సహనంతో ఉండండి

మొదటిపేజీ తరువాయి...

మే 4న ఏపీ హైకోర్టులో జస్టిస్ రాజశేఖర్‌రావు, ఓ యువ న్యాయవాది కోపంతో ఫైళ్లను పోడియంపై కొట్టారని భావించి, అతడిని పోలీసు కస్టడీకి పంపిస్తానని హెచ్చరించారు. అయితే, ఆ న్యాయవాది చేతిలోంచి ఫైలు జారిపోయిందని తెలిపారు. ఈ ఘటనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానాలు చేయడంతో సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు న్యాయమూర్తి కేవలం మౌఖికంగా వ్యాఖ్యానించారని, ఎటువంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వలేదని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ సందర్భంగా, బెంచ్-బార్ (న్యాయమూర్తులు- న్యాయవాదులు) మధ్య వివాదాల పరిష్కారానికి అన్ని హైకోర్టులు, జిల్లా, తాలూకా స్థాయుల్లో గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. అలాగే, కోర్టు విచారణలకు సంబంధించిన ఎడిట్ చేసిన వీడియో క్లిప్పులను సందర్భం లేకుండా ప్రసారం చేయడంపై మీడియా బాధ్యతతో వ్యవహరించాలని, సమాజంలో మీడియా క్రియాశీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

## హైదరాబాద్‌లో బాలుడిపై వీధికుక్కల దాడి..

మొదటిపేజీ తరువాయి...

సిద్దిపేటకు చెందిన ఆద్విక్ అనే బాలుడు వేసవి సెలవుల కోసం టీచర్స్ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం ఇంటి సెల్లార్‌లో ఆడుకుంటుండగా, ఒక్కసారిగా 10 వీధికుక్కలు అతడిపై విరుచుకుపడ్డాయి. బాలుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే అక్కడికి పరుగెత్తుకొచ్చి కుక్కలను తరిమికొట్టారు. అయితే, అప్పటికే కుక్కలు బాలుడి శరీరంపై తీవ్ర గాయాలు చేశాయి. ఈ దాడిలో బాలుడి తలపై చర్మం ఊడిపోయిందని, తీవ్ర రక్తస్రావం అయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కుటుంబసభ్యులు వెంటనే చిన్నారిని సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆద్విక్ పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిసింది. ఈ ఘటనతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వీధికుక్కల సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి...




ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

## నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

మొదటిపేజీ తరువాయి...



వరంగల్,మే12 : జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

## ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో ఉపాధి కూలి మృతి



ఎర్రుపాలెం : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సాని కృష్ణ (43) వడదెబ్బకు గురై మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పనులకు ప్రతిరోజూ హాజరవుతుండేవాడు. ఇటీవల ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో సోమవారం ఉపాధి పనులకు వెళ్లిన కృష్ణ, పని ముగించుకుని ఇంటికి వచ్చిన అనంతరం అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు వారు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన వద్దిరాజు రవిచంద్ర



కారేపల్లి,మే 12 : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని రామలింగాపురం(కారేపల్లి క్రాస్ రోడ్)లో గల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు సిద్ధం శెట్టి చిన్న నాగయ్య తల్లి సిద్ధం శెట్టి వెంకట నరసమ్మ(54) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఫోన్ చేసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం కారేపల్లి క్రాస్ రోడ్ లో వెంకట నరసమ్మ అంతక్రియలు జరగగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముత్యాల వెంకట అప్పారావు పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు హాజరై మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## విషాదం.. నీటి సంపులో పడి ఏడేళ్ల బాలిక మృతి



శేరిలింగంపల్లి: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ ఫ్లాట్స్‌లో విషాదం నెలకొంది. ఓ అపార్ట్మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న చరణ్ కుమార్తె సారా(13) అదే అపార్ట్మెంట్ నీటి సంపులో పడి మృతి చెందింది. బాలిక మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం టేకులపల్లి మండలం మద్దిరాల తండాకు చెందిన చరణ్, రేణుక దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. మియాపూర్ గోకుల్ ఫ్లాట్స్ లో గత పది సంవత్సరాలుగా చరణ్ దంపతులు వాచ్ మెన్ గా పని చేస్తున్నారు. 8 రోజుల కిందట శ్రీ రెసిడెన్సి అపార్ట్మెంట్ లో వాచ్‌మెన్‌గా చేరారు. నిన్న రాత్రి ఏడున్నర గంటల సమయంలో సంపు మూత తీసి ఉంది. సంపు నీటితో నిండింది లేనిది చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయినట్లు భావిస్తున్నారు. కూతురు సారా కనిపించకపోవడంతో చుట్టూ పక్కల వేతికిన చరణ్ దంపతులు.. అనుమానం వచ్చి సంపులో చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సంపులో పడిపోయిన బాలికను బయటకు లాగి హుటాహుటిన నిజాంపేట్ లో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హాస్పిటల్ యాజమాన్యం మియాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ పాఠశాలలో చదువుకుంటున్న బాలిక మృతిపట్ల ఆ సంస్థ ప్రధాన కార్యదర్శిచావ అరుణ ఆందోళన వ్యక్తం చేశారు. బాలిక మృతి పై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.

## కమలాపురంలో దొంగల హల్‌చల్..

# తాళం వేసిన ఇంటికి కన్నం!



మంగపేట: తాళం వేసి శుభకార్యానికి వెళ్లిన ఓ ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు ఇంటి తాళాలు కోసి ఇంట్లోకి చొరబడి సుమారు 3 తులాల బంగారం, 15 తులాల వెండి, లక్షకు పైగా నగదును అపహరించిన ఘటన మండలంలోని కమలాపురం సీపీ నగర్ లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కమలాపురం సీపీ నగర్‌కు చెందిన మేడిద రఘుపతి కుటుంబం శనివారం హన్మకొండలోని తమ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటికి తాళాలు వేసి గేటుకు సైతం తాళం వేసి వెళ్లారు. విషయాన్ని పసిగట్టిన దొంగలు ఇంటి తలుపులకు ఉన్న తాళాలను కోసి చొరబడి బీరువాలో ఉన్న సుమారు 3 తులాల బంగారం, 15 తులాల వెండి, లక్ష రూపాయలకు పైగా ఉన్న నగదును దొంగిలించినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన దొంగలు తలుపులు వేయకుండా వెళ్లిపోవడంతో రెండు రోజులుగా కోతులు ఇంట్లోకి చొరబడి ఇళ్లంతా ఆగమాగం చేయడంతో గమనించిన చుట్టుపక్కల స్థానికులు విషయాన్ని ఇంటి ఓనర్ రఘుపతికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్న రఘుపతి కుటుంబ సభ్యులు ఇంట్లో జరిగిన దొంగతనాన్ని చూసి నిశ్చేష్టులయ్యారు. విషయాన్ని వెంటనే పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే గ్రామంలో నెల రోజుల క్రితం ఇంట్లో ఉన్న ఓ మహిళ మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లడానికి ఇద్దరు మహిళలు ప్రయత్నించగా ఆ మహిళ తీవ్రంగా ప్రతిఘటించడంతో వారు టూ వీలర్ పై పరారయ్యారు. వరుస దొంగతనాలు జరుగుతున్న కమలాపురంలో దొంగల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

## రుద్రారం సర్పంచ్ హెచ్చరిక



జయశంకర్ భూపాలపల్లి: మే 12 (తెలంగాణ వాణి ప్రతినిధి): ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న అసత్య ఆరోపణలను రుద్రారం సర్పంచ్ చంద్రగిరి సంపత్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం కాటారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరాంపల్లి రోడ్డు విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దళిత నాయకుడైన దండు రమేష్ వాస్తవాలను ఆధారాలతో సహా ప్రజలకు వివరిస్తుంటే, ఓర్వలేక ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. ?గతంలో పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దళితులపై దాడులు, హత్యలు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలబడి పోరాడింది దండు రమేష్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెరచాటున ఉండి కొందరు నాయకులు దళిత నాయకులను రెచ్చగొడుతున్నారని, ఇలాంటి కుట్రలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, వార్డు సభ్యులు గాదె గట్టయ్య, చంద్రగిరి అశోక్, కుమ్మెర స్వామి, పీఏసీ డైరెక్టర్ సంగెం రమేష్ మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# జనావాసాల మధ్యలో ఉన్న వైన్స్ శాప్ ల సంగతేంటి..!

**- ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బంది గా ఉన్న ఆ రెండు వైన్స్ షాప్ లు**
**- ఊరికి దూరంగా తరలించాలని ప్రయానికులు, ప్రజల విజ్ఞప్తి**
**- అధికారులు,గ్రామ పంచాయితీ పాలక వర్గం చొరవ చూపాలి**





కమలాపూర్ తెలంగాణ వాణి ప్రతినిధి ( మే 12 ) : ప్రజల ఆరోగ్య పరిస్థితి మరియు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారనే ఉదేశ్యం తో కమలాపూర్ పంచాయితీ పాలక వర్గం కమలాపూర్ లో బెల్ట్ షాపులలు నిషేదించడాన్ని ప్రజలు ఆహ్వానిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కమలాపూర్ బస్టాండ్ దగ్గరలో జనావాసాల మధ్య వాహనాలకు జనాలకు ఇబ్బంది కలిగే విధంగా రాజ రాజేశ్వరి వైన్స్ షాప్ మరియు లక్కీ వైన్స్ షాప్ లు రెండు ప్రజలకు మరియు వాహనదారులకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్నాయని ఈ విషయం పై కూడా కమలాపూర్ గ్రామ పంచాయితీ పాలకవర్గం తీర్మాణంచేసి ఆ రెండు వైన్ శాపులను ఊరికి దూరంగా పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే వంగపెల్లి, మర్రిపెల్లి గూడెం ఆటో స్టాండ్ వైన్స్ షాప్ దగ్గర ఉండటం వల్ల అక్కడ మహిళలు నిలబడే పరిస్థితి లేదని, అలాగే ఆ వైన్ షాప్ లకి వెళ్లే వారు తమ వాహనాలను రోడ్ల పైనే పెట్టడం వల్ల ప్రయాణికులకు చాలా విబ్బంది గా ఉందని ప్రజలు, ప్రయానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీ గా ఉండే ప్రదేశం లో వైన్స్ షాప్ లు ఉండటం వల్ల కొంత మంది అతి గా తాగి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని దీనిపై అధికారులు, మరియు కమలాపూర్ గ్రామ పంచాయితీ పాలక వర్గం ఆ రెండు వైన్స్ షాప్ లను అక్కడ నుండి తరలించాలని కమలాపూర్ గ్రామ, మరియు మండల ప్రజలు, ప్రయాణి కులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 60 గజాలలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



కుత్బుల్లాపూర్ మే 12 (తెలంగాణ వాణి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ సమీపంలో ఉన్న 60 గజాలలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు .ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతోని అభిషేకమ వడ మాల, తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న మల్లేష్ యాదవ్ స్వామి వారికి షెడ్డును నిర్మించారు. అనంతరము భజన కార్యక్రమాలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమము జరిగింది.

## బండి సంజయ్ కొడుకుని తక్షణమే అరెస్ట్ చేయాలని పాల్వంచలో నిరసన

పాల్వంచ, మే 12 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పాల్వంచలో మంగళవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, 7వ డివిజన్ కార్పొరేటర్ కాలేరు సింధు తపస్వి ఆధ్వర్యంలో నిరసన, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు తాత్పర్యం చేస్తుందని పోలీసులు కూడా మెతక వైఖరి అవలంబిస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సామాన్యుడు చిన్న తప్పు చేస్తే వెంటనే స్పందించే పోలీసులు, ప్రభుత్వం ఇంత పెద్ద తప్పు చేసిన ఒక ప్రముఖుడిని కాపాడేందుకు కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కై బాధితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని, నిందితుడికి కఠిన శిక్ష విధించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సిఐడి దర్యాప్తు చేపట్టి తక్షణమే బండి భగీరథ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ కాలేరు సింధు తపస్వి, పూజారి వెంకటేశ్వర్లు, శిఖ సాగర్, అఖిల్ మహర్షి, వాసు, లింగయ్య, నరేష్, నరసింహ, చింతా మోహన్, అరుణ, లక్ష్మీ, శైలజ,ఎస్తేరు, నాంచారమ్మ,రవి,సాహిత్ పాల్గొన్నారు.



## ప్రపంచంలో ఈ ఒక్క చోట మాత్రం

# ప్రతి రాత్రి ఉరుములు మెరుపులే!



- ప్రపంచంలోనే అత్యధిక మెరుపుల ప్రాంతంగా వెనెజువెలా సరస్సు
- రాత్రిపూట నిరంతరం కొనసాగే కటటుంబో లైట్నింగ్
- పర్వత గాలులు, సరస్సులోని తేమ వల్లే ఈ అద్భుతం
- నాసా కొత్త టెక్నాలజీతో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు
- గతంలో కాంగో బేసిన్‌ను ప్రథమ స్థానంలో భావించేవారు

ఢిల్లీ,: ప్రపంచంలో ఒకచోట మాత్రం దాదాపు ప్రతి రాత్రి మెరుపులు ఏర్పడతాయని తెలుసా? వెనెజువెలాలోని మారకైబో సరస్సు ఈ ప్రశ్నకు సమాధానంగా నిలుస్తోంది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసిన సరికొత్త లైట్నింగ్ మ్యాప్స్ ప్రకారం, ఈ సరస్సు ప్రపంచంలోనే అత్యధిక మెరుపులు నమోదయ్యే 'లైట్నింగ్ హాట్‌స్పాట్'గా రికార్డు సృష్టించింది. ఇక్కడ రాత్రి సమయంలో దాదాపు నిరంతరం మెరుపులు సంభవిస్తూనే ఉంటాయి. ఈ అద్భుతమైన సహజ సంఘటనను "కటటుంబో లైట్నింగ్" అని పిలుస్తారు. సాధారణంగా ఉష్ణమండల ప్రాంతాల్లో పగటిపూట ఎండ వేడికి తేమతో కూడిన గాలి పైకి లేచి ఉరుములతో కూడిన మేఘాలు ఏర్పడతాయి. కానీ మారకైబో సరస్సు వద్ద పరిస్థితి దీనికి భిన్నం. ఇక్కడ రాత్రి సమయంలో చుట్టుపక్కల ఉన్న పర్వతాల నుంచి చల్లని గాలులు సరస్సు వైపు వీస్తాయి. ఆ చల్లని గాలి, సరస్సుపై ఉన్న వేడి, తేమతో నిండిన గాలిని పైకి నెట్టడంతో శక్తివంతమైన ఉరుములు, మెరుపులు ఏర్పడతాయి. ముఖ్యంగా కటటుంబో నది సరస్సులో కలిసే ముఖద్వారం వద్ద ఈ ప్రక్రియ అత్యంత చురుగ్గా ఉంటుంది. అందుకే నాసా శాస్త్రవేత్తలు ఈ ప్రాంతాన్ని "భూమిపై అత్యంత విద్యుత్ శక్తి కలిగిన ప్రదేశాల్లో ఒకటి"గా అభివర్ణించారు. గతంలో తక్కువ రిజల్యూషన్ శాటిలైట్ డేటాతో కాంగో నదీ పరీవాహక ప్రాంతాన్ని ప్రపంచంలోనే నంబర్ వన్ లైట్నింగ్ హాట్‌స్పాట్‌గా భావించేవారు. అయితే, నాసా యొక్క లైట్నింగ్ ఇమేజింగ్ సెన్సార్ వంటి అధునాతన సాంకేతికతతో చేసిన పరిశీలనలో మారకైబో సరస్సు ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సరస్సు ప్రాంతం వాతావరణ మార్పులు, వర్షపాతం వంటి అంశాలపై అధ్యయనం చేయడానికి ఒక సహజ ప్రయోగశాలగా ఉపయోగపడుతోంది. స్థానికులకు మాత్రం ఇది ప్రతి రాత్రి కనువిందు చేసే ఒక అద్భుతం.

# ఏటీఎంలో సెలూన్ షాప్..

- బీహార్‌లో ఎస్బీఐ ఏటీఎం బోర్డుతో నడుస్తున్న సెలూన్
- డబ్బుల కోసం వెళ్లినవారికి కటింగ్, షేవింగ్ సేవలు
- ఖాళీ అయిన ఏటీఎం స్థలంలోనే సెలూన్ ఏర్పాటు
- వీడియో వైరల్ కావడంతో ఎస్బీఐ బోర్డు తొలగింపు
- నెట్టింట నవ్వులు పూయిస్తున్న 'సెలూన్ ఏటీఎం'




బీహార్: బీహార్‌లోని దానాపూర్‌లో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లే ఓ ఎస్బీఐ ఏటీఎం, ఇప్పుడు హెయిర్‌కట్, షేవింగ్ చేసే సెలూన్‌గా మారిపోయింది. బయట నుంచి చూస్తే అచ్చం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం లాగే కనిపించడంతో లోపలికి వెళ్లిన వారు షాక్ అవుతున్నారు. ఈ విచిత్రమైన 'సెలూన్ ఏటీఎం'కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దానాపూర్‌లోని రూపస్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఈ ఏటీఎం కియోస్క్ వద్ద కొన్నేళ్ల పాటు ఎస్బీఐ ఏటీఎం పనిచేసేది. కొన్ని నెలల క్రితం బ్యాంకు ఆ ఏటీఎంను అక్కడి నుంచి తొలగించింది. అయితే, ఏటీఎం ఖాళీ అయినా బయట ఉన్న ఎస్బీఐ బోర్డు, లోగో వంటి గుర్తులను మాత్రం అలాగే వదిలేశారు. ఆ తర్వాత ఆ ఖాళీ స్థలాన్ని ఓ సెలూన్ యజమాని అద్దెకు తీసుకున్నారు. బయట ఏటీఎం బోర్డు ఉండటంతో డబ్బుల కోసం చాలామంది లోపలికి వెళ్తున్నారు. తీరా అక్కడ ఏటీఎం మెషీన్‌కు బదులుగా సెలూన్ కుర్చీలు, అద్దాలు, కటింగ్ పరికరాలు చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ ఘటనపై వీడియో వైరల్ కావడంతో అధికారులు వెంటనే స్పందించి ఎస్బీఐ బోర్డు, లోగోను తొలగించారు. ఈ విషయంపై నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు. "డబ్బులు విత్‌డ్రా చేయడానికి వెళ్తే, హెయిర్‌కట్‌తో బయటకు వస్తున్నారు" అంటూ కొందరు కామెంట్ చేశారు. ఇది అసలైన భారతీయ 'జుగాడ్' అని మరికొందరు అభిప్రాయపడ్డారు. పాత గుర్తులను తొలగించకుండా కొత్త వ్యాపారాలు చేయడం ఇక్కడ సాధారణమేనని మరికొందరు చమత్కరించారు.

## మహిళ మెడలో నుంచి

# బంగారు గొలుసు చోరీ



కొల్చారం: మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్ తెలిపారు. ఎస్సై మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంశెట్టిపల్లికి చెందిన బోల లావణ్య(38) అనే మహిళకు ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలోని రైతు వేదిక ఎదురుగా జై దుర్గా భవాని చేపల దుకాణం ఉంది. సోమవారం మధ్యాహ్నం సుమారు 3:25 గంటల సమయంలో షాపు షట్టర్ తెరిచి విశ్రాంతి తీసుకుంటుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలోకి ప్రవేశించారు. అదే సమయంలో ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాగి, ఒప్పో సెల్‌ఫోన్‌ను అపహరించి స్కూటీపై పరారైనట్లు తెలిపారు. బాధితురాలు గట్టిగా అరుస్తూ వారి వెంట వెళ్లిన దుండగులు తప్పించుకున్నారని పేర్కొన్నారు. అపహరించబడిన బంగారు పుస్తెల తాడు సుమారు మూడు తులాలు ఉండి దాని విలువ రూ.4.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్ తెలిపారు.

# నైపుణ్య కేంద్రాలుగా లేబర్ అడ్డాలు

### చంద్రబాబు ఆలోచనతో మారనున్న జీవితాలు
### అసంఘటితరంగ కార్మికులకు పనిభరోసా
### కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్



విజయవాడ, :లేబర్ అడ్డాలు కేవలం పనికోసం వేచిచూసే ప్రదేశాలు కావు, అవి శ్రమజీవుల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీకలుగా నిలిచేలా తీర్చిదిద్దుతున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కష్టజీవుల ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేబర్ అడ్డాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వారికి నైపుణ్య శక్షణ ఇప్పించడం ద్వారా నిష్ణాతులను చేయాలన్న సంకల్పం ఉందన్నారు. . రాష్ట్రంలో 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గంగా, వారిని గౌరవప్రదమైన జీవనం వైపు నడిపించే కేంద్రాలుగా ఈ అడ్డాలు మారబోతు న్నాయన్నారు. మేడే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా జిల్లా పమిడిముక్కలో ఈ లేబర్ అడ్డాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 15 నగరాల్లో ఈ అడ్డాలను నిర్మిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చనున్నారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిస్తారు. తద్వారా వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్‌గా తయారు చేస్తారు. ఇప్పటికే నైపుణ్యం ఉన్న వారికి కూడా మరింత శిక్షణ ఇచ్చి హైపవర్ స్కిల్డ్ లేబర్‌గా గుర్తిస్తారు. తద్వారా కార్మికుల సంక్షేమం, జీవితాలను సమూలంగా మార్చాలన్నది చంద్రబాబు ఉద్దేశం అని వివరించారు. అంతేకాకుండా ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా వీరికి మెరుగైన వైద్యం అందిస్తారు.కార్మికుల సేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చౌక్‌కు వెళ్ళి సంప్రదించొచ్చు. అంతేకాకుండా కార్మికులకు పక్కా చిరునామా, వీరందరి కోసం తగిన సదుపాయాలతో ప్రత్యేక భవనాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. అందుకు సంబంధించి స్థల సేకరణ కూడ జరుగుతున్నది. లేబర్ అడ్డాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేస్తారు. వీటిలో తాగునీటి సదుపాయం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, వంద నుంచి రెండు వందల మంది కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారు.. తెల్లవారుజామునే లేచి, ఎండనక, వాననక పని కోసం రోడెడక్కి, ఆత్మవిశ్వాసంతో కష్టపడే శ్రామికులకు నైతిక బలం ఈ అడ్డాలు. కూటమి ప్రభుత్వం కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లేబర్ అడ్డాల వద్ద ఆధునిక వసతులు, విశ్రాంతి గదులు కల్పించాలని నిర్ణయించిందన్నారు. ఉన్న ఊరిలో ఉపాధి లేక పట్టణాలకు వలస పోయి అడ్డా కూలీలుగా మారిన ఉదంతాలు కోకొల్లలు, గ్రామాల నుంచి పని కోసం నగరంలోని కూలీ అడ్డాకు తరలివచ్చేవారు. ప్రతిపక్ష నాయకుడుగా రాష్ట్రంలో పర్యటించినప్పుడు కుటుంబాన్ని పోషించడానికి ఆ కష్టజీవులు పడుతున్న తపనకు పరిష్కారం చూపాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో మెదిలింది. నిరుపేద కుటుంబాలు మనుషులుగా తల ఎత్తుకుని బతికినప్పుడే కదా అభివృద్ధి అని ఆయన భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ కూలీలకు ఏదో ఒక ప్రయోజనం చేకూర్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన ప్రారంభించింది. ఆ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్లపక్కన వేచి చూసే పని లేకుండా లేబర్ అడ్డాలకు శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే ఏడాదిలో రాష్ట్రానికి మరిన్ని ప్రైవేట్ కంపెనీలు రానున్నాయి. ఆయా కంపెనీల నిర్మాణాలు సాగేటప్పుడు వారికి నైపుణ్యం ఉన్న కార్మికులు కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులను పెంచడం ద్వారా పెట్టుబడిదారులు వేర్వేరు ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చుకోకుండా స్థానికులకు ఉపాధి కల్పించాలనేది చంద్రబాబు నాయుడు ఆలోచన. ఆ దిశగా అడుగులు వేయడం వల్ల కార్మికులకు మేలు జరుగుతుందని, రాష్ట్రానికి కూడా ఉపయోగపడుతుందనే ముందు చూపుతోనే ఆయన లేబర్ అడ్డాలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కార్మికుల సంక్షేమం కోసం కబుర్లు చెబుతూ కాలక్షేపం చేయకుండా వారి కోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం అని వాసంశెట్టివివరించారు.

## చెక్ పోస్ట్‌ల వద్ద
# నిఘా ఏర్పాట్లు ముమ్మరం
## మంచిర్యాల డీసీపీ

మంచిర్యాల: చెక్ పోస్ట్‌ల వద్ద నిఘా ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక నిఘా ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి తాండూర్ మండలం రేపల్లెవాడ చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణా విషయంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వాహనం తనిఖీ చేసే సమయంలో పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. సంబంధిత పాత్రలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. వాహనాల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఎవరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. రాత్రి సమయాల్లో పశువుల అక్రమ చేస్తే పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు.

నిఘా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చూడాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి, తాండూర్ సీఐలు శ్రీనివాస్ రావు, దేవయ్య, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## నెల రోజులైన ధాన్యం కొనుగోళ్లు లేదు.. రోడ్డెక్కిన అన్నదాతలు



మామడ: అహర్నిశలు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే కన్నీళ్లు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని న్యూ సాంగ్వి క్రాస్ రోడ్ వద్ద రైతులు ధర్నా చేశారు. సాంగ్వి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని లారీల , గోనె సంచుల, హమాలీల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికీ 9 లారీలు రైస్ మిల్లులకు వెళ్లాయని ఒక బస్తా ధాన్యానికి నాలుగు కిలోల కోత విధిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూ సాంగ్వి, చందారం గ్రామాల రైతులు రోడ్డుపై రెండు గంటల పాటు రహదారిపై బైఠాయించడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కలెక్టర్ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని రోడ్డుపై కూర్చున్నారు. జెసి కొనుగోలు కేంద్రాలు సందర్శించినప్పుడు 42 కిలోల వరకు కొనుగోలు చేస్తామని చెప్పారని, ఇప్పుడు 44 కిలోల కోత ఎలా విధిస్తున్నారని అధికారులను రైతులు నిలదీశారు.

## తండ్రి పెద్దకర్మ రోజే
# కుమారుడి ఆత్మహత్య..
## మిన్నంటిన రోదనలు



ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో విషాదసంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండ్రి పెద్దకర్మ రోజే కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసింది. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న పాముల భాస్కర్(45) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి పాముల బాలమల్లు వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా సోమవారం తండ్రి దినకర్మ రోజే కుమారుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం రాత్రి కార్యక్రమం ముగిసిన తర్వాత భాస్కర్ ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినఆచూకీ లభించలేదు. వేకువ జామునమళ్లీ వెతికేసరికి చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. భాస్కర్ ఆత్మహ త్యకు గలకారణాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది. మృతుడికి భార్య పద్మ, కూతుళ్ల భవిష్య, ఆదిత్య కొడుకు సాత్రమాట్ ఉన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం.

# గ్రహాంతరవాసులు నిజంగానే ఉన్నారా..?



దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి, అనుమానాలు, కుట్ర సిద్ధాంతాలకు కేంద్రబిందువుగా మారిన గ్రహాంతరవాసులు, గుర్తించబడని ఎగిరే వస్తువుల మిస్టరీపై అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నో ఏళ్లుగా పెంటగాన్ వద్ద అత్యంత రహస్యంగా ఉంచిన యూఎఫ్ఓ ఫైళ్లను ఇప్పుడు దశలవారీగా బహిర్గతం చేయడం ప్రారంభించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ మొదలైనట్లు రక్షణ శాఖ వెల్లడించింది. పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు నిజాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. 'ప్రెసిడెన్షియల్ అన్‌సీలింగ్ అండ్ రిపోర్టింగ్ సిస్టమ్ ఫర్ యూఏపీ ఎన్‌కౌంటర్స్' పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, యూఏపీ, యూఎఫ్ఓలకు సంబంధించిన పాత రహస్య పత్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనికోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించినట్లు సమాచారం. గతంలో అమెరికా ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలను పూర్తిగా ప్రజలకు తెలియనివ్వకుండా గోప్యంగా ఉంచాయని, కానీ ఇప్పుడు ప్రజలే ఈ ఫైళ్లను పరిశీలించి తమ అభిప్రాయాలను ఏర్పరుచుకునే అవకాశం కల్పిస్తున్నామని పెంటగాన్ పేర్కొంది. చాలా కాలంగా గ్రహాంతరవాసుల ఉనికిపై ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన చర్చ జరుగుతోంది. ఆకాశంలో కనిపించే వింత కాంతులు, గుర్తించలేని ఎగిరే వస్తువులు, సైనిక పైలట్లు రికార్డు చేసిన అసాధారణ దృశ్యాలు వంటి అంశాలు ఎన్నో సందేహాలకు దారితీశాయి. ఇప్పుడు విడుదలవుతున్న ఫైళ్లతో ఈ మిస్టరీపై మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఫైళ్ల సేకరణ, విశ్లేషణ ప్రక్రియలో అమెరికాలోని పలు ప్రముఖ ఏజెన్సీలు భాగస్వామ్యం అవుతున్నాయి. అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఆల్-డొమైన్ అనోమలీ రిజల్యూషన్ ఆఫీస్‌తో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ, నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగాలు కూడా ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివిధ కాలాల్లో నమోదైన యూఏపీ ఘటనలకు సంబంధించిన నివేదికలు, వీడియోలు, రాడార్ సమాచారాన్ని పరిశీలించి క్రమంగా ప్రజలకు విడుదల చేయనున్నారు. ముఖ్యంగా అమెరికా సైనిక విమానాలు ఎదుర్కొన్న అసాధారణ ఘటనలకు సంబంధించిన రికార్డులు ప్రజల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఫిబ్రవరి 19న తన ట్రూత్ సోషల్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గ్రహాంతరవాసులు, యూఏపీ, యూఎఫ్ఓలకు సంబంధించిన అన్ని రహస్యాలను బయటపెట్టాలని తాను యుద్ధ కార్యదర్శిని ఆదేశించినట్లు ట్రంప్ వెల్లడించారు. ప్రజల్లో ఉన్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ఇకపై ఈ అంశాలను రహస్యంగా ఉంచకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జేఎఫ్‌కే, మార్టిన్ లూథర్ కింగ్ హత్యలకు సంబంధించిన పాత రహస్య పత్రాలను విడుదల చేసిన ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు విశ్వ రహస్యాలపై దృష్టి సారించడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే విడుదలవుతున్న ప్రతి సమాచారం నిజంగానే గ్రహాంతరవాసులకు సంబంధించినదని భావించకూడదని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సైనిక సాంకేతిక పరిజ్ఞానం, గగనతల వ్యవస్థలపై సరైన అవగాహన లేని వ్యక్తులు సాధారణ వైమానిక దృశ్యాలను కూడా యూఎఫ్ఓలుగా భావించే అవకాశం ఉందని చెబుతున్నారు. పెంటగాన్ గతంలో నిర్వహించిన సమీక్షల్లో ఇప్పటివరకు గ్రహాంతర జీవుల ఉనికిని నిర్ధారించే బలమైన ఆధారాలు ఏవీ లభించలేదని వెల్లడించింది. అయినప్పటికీ ఈ ఫైళ్ల విడుదలతో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అనుమానాలకు కొంతమేర స్పష్టత వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. విశ్వంలో మనుషులు మాత్రమే ఉన్నారా? లేక మరెక్కడైనా జీవం ఉందా? అనే ప్రశ్నకు ఈ పత్రాలు సమాధానం ఇస్తాయేమోనని ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు..

# సెమిస్టర్ విధానం?



హైదరాబాద్,: తెలంగాణ విద్యా విధానం కమిటీ రాష్ట్రంలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వార్షిక పరీక్షల వల్ల విద్యార్థులపై పడే ఒత్తిడిని తగ్గించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై శ్రద్ధ చూపేలా ఈ మార్పు చేయనున్నారు. థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు, అనుభవపూర్వక అభ్యసనానికి ప్రాధాన్యతనిస్తూ, పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలిస్తోంది.తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు సర్కార్ సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వార్షిక విద్యా విధానం స్థానంలో.. ఉన్నత విద్య (యూజీ/పీజీ) తరహాలోనే పాఠశాల స్థాయిలోనూ సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా తెలంగాణ విద్యా విధానం కమిటీ సభ్యులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు ఏడాది పొడవునా సిలబస్ మొత్తాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక విధానంలో విద్యార్థులు పరీక్షలకు కొద్ది నెలల ముందు మాత్రమే పుస్తకాలు పట్టే ధోరణి కనిపిస్తోంది. అలాగే, మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీ సిలబస్‌ను పునశ్చరణ చేయడం విద్యార్థులకు సవాలుగా మారుతోంది. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై దృష్టి సారిస్తారు. మొదటి సెమిస్టర్‌లో సాధించిన ఫలితాలను బట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి రెండో సెమిస్టర్ నాటికి వారిని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఈ విధానానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ స్కూల్ స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తొలుత ఇంటర్మీడియట్‌కైనా ఈ విధానాన్ని వర్తింపజేయాలని కమిటీ భావిస్తోంది.ఈ మార్పులతో పాటు, బట్టీ పద్ధతికి స్వస్తి పలికి అనుభవపూర్వక అభ్యసన విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. కేవలం థియరీ పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులు తాము చదువుతున్న విషయాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకునేలా ల్యాబ్‌లను ఆధునీకరించనున్నారు. ప్రతి విషయాన్ని జ్ఞాపకశక్తితో కాకుండా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడం వల్ల అది వారి మెదడులో శాశ్వతంగా నిలిచిపోతుందని కమిటీ బలంగా నమ్ముతోంది. ఇందులో భాగంగానే పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు.ల్యాబ్‌ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై కూడా కమిటీ ప్రత్యేక నివేదికను రూపొందిస్తోంది. విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రతిపాదనలు గనుక పట్టాలెక్కితే.. తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నమూనాగా మారనుంది. టీచర్లు కూడా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేసేందుకు ఈ సెమిస్టర్ విధానం ఎంతో సహకరిస్తుందని కమిటీ సభ్యులు వెల్లడించారు.

# 30 పడకల ఆసుపత్రిగా ఏన్కూర్ ప్రభుత్వ వైద్యశాల అప్‌గ్రేడ్?



ఏన్కూర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా పనిచేస్తుంది. వైరా నియోజకవర్గంలో ఎక్కువగా గిరిజన ప్రజలు వైద్యపరంగా ఇబ్బందులు పడకుండా ఉండాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ ప్రత్యేక చొరవతో పది పడకల ఆసుపత్రిగా ఉన్న ఏనుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానంగా ఉన్న ఒక ఎకరం 40 గుంటల ప్రభుత్వ భూమిని 30 పడకల ఆసుపత్రిగా త్వరలో నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భూమిని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు స్వాధీన పరచడం జరిగింది. ఏన్కూరు మండల కేంద్రం సుమారు 32,000 జనాభా కలిగి ఎక్కువ గిరిజన గ్రామాల ప్రజలు ఈ ప్రాంతంలో నివసిస్తూ వైద్య పరంగా నిత్యం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలు పొందేందుకు రావడం జరుగుతుంది. ఎమ్మెల్యే మాలోతు రామదాస్ నాయక్ ఈ ప్రాంత గిరిజన ప్రజలకు వైద్య పరంగా ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం దగ్గర తన పలుకుబడి ఉపయోగించి ఏన్కూర్ పీహెచ్సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 30 పడకల ఆసుపత్రికి భవన నిర్మాణాలు జరిపి తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి ఈ ప్రాంత గిరిజన ప్రజలకు వైద్య పరంగా ఎలాంటి లోటు రాకుండా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బస్టాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైవే ఉ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. నూతన బస్టాండ్ ఏర్పాటు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ ఎండీ, కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో బస్టాండ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు, స్థలం కేటాయించాలని మంత్రి ఆదేశించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ పట్టణంగా విస్తరిస్తుందని, ప్రస్తుతం లక్ష జనాభాకు పైగా ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుతం ఉన్న కొత్త బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. 44వ జాతీయ రహదారి విస్తరణతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్‌పూర్, కోరుట్ల, మెట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదని, నాన్‌స్టాప్ బస్సుల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమి ఆర్టీసీకి అనుకూలంగా ఉన్నందున ఆ స్థలాన్ని కేటాయించి నాన్‌స్టాప్ లేదా హైవే బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు సాఫీగా జరుగుతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో అడ్లూర్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, క్రెడా అధ్యక్షులు గణగోని లక్ష్మి నర్సాగౌడ్, కాంగ్రెస్ నేతలు శ్రీధర్ రావ్ ఉన్నారు.

# నీట్ 'గెస్ పేపర్' కలకలం..

## దర్యాప్తు ముమ్మరం చేసిన రాజస్థాన్ ఎస్ఓజీ

**- నీట్-యూజీ 2026 పరీక్షలో అక్రమాలపై దేశవ్యాప్త దుమారం**

**- పరీక్షకు ముందే 'గెస్ పేపర్' సర్క్యులేట్ అయినట్లు ఆరోపణలు**

**- రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దర్యాప్తు, 13 మంది అనుమానితుల అదుపు**

**- గెస్ పేపర్‌లోని 100కి పైగా ప్రశ్నలు అసలు పేపర్‌లో వచ్చినట్లు గుర్తింపు**

**- విచారణ కొనసాగుతుండగానే ప్రొవిజనల్ ఆన్సర్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ**



ఢిల్లీ,: వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో భారీ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. పరీక్షకు ముందే 'గెస్ పేపర్' పేరిట కొందరు విద్యార్థులకు ప్రశ్నపత్రం అందిందన్న ఆరోపణలపై రాజస్థాన్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో మొత్తం 13 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎస్ఓజీ ఏడీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించిన వివరాల ప్రకారం, "పరీక్షకు దాదాపు నెల రోజుల ముందే 410 ప్రశ్నలతో కూడిన ఒక 'గెస్ పేపర్' సర్క్యులేట్ అయింది. అందులోని కెమిస్ట్రీ విభాగానికి చెందిన సుమారు 120 ప్రశ్నలు, అసలు నీట్ పరీక్ష పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు ప్రాథమికంగా గుర్తించాం" అని తెలిపారు. ఈ గెస్ పేపర్‌ను రూ. 30,000 నుంచి రూ. 5 లక్షల వరకు అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేరళలో చదువుతున్న చురు జిల్లాకు చెందిన ఓ మెడికల్ విద్యార్థి ద్వారా ఈ పేపర్ రాజస్థాన్‌లోని కోచింగ్ సెంటర్లకు చేరినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మరోవైపు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ఆరోపణలపై స్పందించింది.

తమకు మే 7న దీనిపై సమాచారం అందిందని, వెంటనే కేంద్ర ఏజెన్సీలకు విచారణ కోసం అప్పగించామని తెలిపింది. అయితే, దీనిని అధికారికంగా 'పేపర్ లీక్' అని ధ్రువీకరించలేదు. పటిష్ఠ భద్రత మధ్యే పరీక్ష నిర్వహించామని స్పష్టం చేసింది. ఈ వివాదం కొనసాగుతుండగానే, ఎన్‌టీఏ తాజాగా నీట్ ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేయడం గమనార్హం. ప్రస్తుతం ఎస్ఓజీ బృందాలు ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేస్తున్నాయి.

# పాలమూరులో పారిశ్రామిక విప్లవం

మహబూబ్ నగర్, : హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు 80 కి.మీ. మేర ఎన్‌హెచ్-167 విస్తరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. రూ. 3,180 కోట్ల అంచనా వ్యయంతో పీఎం గతిశక్తి పథకం కింద చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా మూడు ఎకనమిక్, ఏడు లాజిస్టిక్ నోడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ రహదారి విస్తరణతో హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుసంధానం ఏర్పడి, పాలమూరు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారనుంది.తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పారిశ్రామికంగా మరో ఉన్నత స్థాయికి చేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో బృహత్తర అడుగు వేసింది. హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో అత్యంత కీలకమైన ఎన్‌హెచ్-167 జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ నేడు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎం గతిశక్తి పథకంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు కేవలం రహదారి విస్తరణ మాత్రమే కాకుండా సమగ్ర ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా చేసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు ఉన్న 80 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు.ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఫార్మాసిటీలు, మెడికల్ క్లస్టర్లను హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌తో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారి వెంట మూడు ఎకనమిక్ నోడ్స్, ఏడు లాజిస్టిక్స్ నోడ్స్, తొమ్మిది సామాజిక నోడ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జడ్చర్ల వరకు ఉన్న నాలుగు వరుసల రహదారిని భవిష్యత్తులో ఆరు వరుసలకు పెంచే ఆలోచన ఉండగా.. వెనుకబడిన మహబూబ్‌నగర్-గుడెబల్లూర్ మార్గాన్ని ఇప్పుడు నాలుగు వరుసలుగా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా షాద్‌నగర్, కొత్తూరు, జడ్చర్ల పారిశ్రామికవాడలకు ఈ కొత్త రహదారి అదనపు బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులుభావిస్తున్నారు.మౌలిక సదుపాయాల పరంగా ఈ ప్రాజెక్టును అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ఈ 80 కి.మీ. విస్తరణలో 5 పెద్ద వంతెనలు, 36 చిన్న వంతెనలు, 260 కల్వర్టులను నిర్మించనున్నారు. ప్రయాణికుల భద్రత, సులభతర రాకపోకల కోసం 11 హై-లెవల్ వెహికల్ అండర్‌పాస్‌లు, 22 లో-లెవల్ వీయూపీలు, ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ దక్కించుకోగా.. రూ. 3,180 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో నిర్మాణాన్ని చేపట్టనున్నారు.ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, గుత్తేదారు సంస్థ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. పనులను ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారి పూర్తయితే.. మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు మీదుగా కర్ణాటకకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక వారధిగా నిలవనుంది.

## దేశం కోసం ఇంధనం పొదుపు చేయండి...

# ప్రధాని మోదీ ఈ పిలుపు ఎందుకు ఇచ్చారంటే..!

**- అంతర్జాతీయ పరిణామాలతో పెరుగుతున్న ముడి చమురు ధరలే కారణం**

**- ప్రజా రవాణా, కార్‌పూలింగ్‌ను ఎక్కువగా వాడాలని సూచన**

**- భారత్ తన అవసరాల్లో 88% ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని వెల్లడి**

**- ప్రతి పౌరుడు దేశం కోసం ముందడుగు వేయాలని విజ్ఞప్తి**

ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఓ అసాధారణమైన, ప్రత్యక్ష పిలుపునిచ్చారు. ఇది ఓట్ల కోసమో, ప్రభుత్వ పథకం కోసమో కాదు. దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరి దైనందిన అలవాట్లను మార్చుకోవాలని ఆయన కోరారు. గుజరాత్‌లోని వడోదరలో జరిగిన ఓ బహిరంగ సభలో మాట్లాడిన ప్రధాని, 20 గంటల వ్యవధిలో రెండోసారి ఇంధన పొదుపు ఆవశ్యకతను నొక్కిచెప్పారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలు, సరఫరా గొలుసులో అంతరాయాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు 140 కోట్ల మంది భారతీయులు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసారి ప్రధాని మోదీ చేసిన విజ్ఞప్తి ఓ బడ్జెట్ ప్రకటనలాగానో, కొత్త పాలసీలాగానో లేదు. దేశం ప్రస్తుతం ఓ యుద్ధం చేయకపోయినా.. దాని పర్యవసానాలకు మూల్యం చెల్లిస్తోందని, ఈ పరిస్థితుల్లో ప్రతి పౌరుడూ ఒక 'ఆర్థిక సైనికుడి'లా వ్యవహరించాలని ఆయన కోరారు. "140 కోట్ల మంది ప్రజలు ఒక్క అడుగు ముందుకు వేస్తే, దేశం 140 కోట్ల అడుగులు ముందుకు వేస్తుంది. అందుకే, ఈ ప్రపంచ సంక్షోభ సమయంలో నా దేశ ప్రజలకు కొన్ని ప్రత్యేక అభ్యర్థనలు చేస్తున్నాను" అని మోదీ అన్నారు.

ప్రధాని ఈ పిలుపు ఎందుకు ఇచ్చారంటే..!: ప్రధాని మోదీ ఈ విజ్ఞప్తి చేయడానికి బలమైన ఆర్థిక కారణాలున్నాయి. ముడి చమురు వినియోగంలో, దిగుమతిలో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశం. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (PPAC) గణాంకాల ప్రకారం 2025 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో భారత్ ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం 88 శాతానికి చేరింది. గతేడాది ఇదే సమయానికి ఇది 87.6 శాతంగా ఉండేది. దేశీయంగా ఉత్పత్తి నిలకడగా ఉండగా, డిమాండ్ మాత్రం భారీగా పెరుగుతుండటమేఇందుకు కారణం. దిగుమతుల కోసం వెచ్చిస్తున్న విదేశీ మారక ద్రవ్యం కూడా ఆందోళనకరంగా మారింది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లోనే భారత్ ముడి చమురు దిగుమతులకైన ఖర్చు 71.3 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 5.95 లక్షల కోట్లు) చేరింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 12 శాతం అధికం. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఇంధన పొదుపును ఒక జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. "మనకు పెద్ద చమురు బావులు లేవు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను దిగుమతి చేసుకోవాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా వీటి ధరలు విపరీతంగా పెరిగినందున, ఇంధనాన్ని పొదుపు చేసి, దానికోసం వెచ్చిస్తున్న విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు.



ప్రధాని సూచించిన మార్గాలు: ఇంధనాన్ని ఆదా చేసేందుకు ప్రధాని కొన్ని స్పష్టమైన సూచనలు చేశారు. వీలైనంత వరకు పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. అందుబాటులో ఉన్న చోట్ల మెట్రో రైళ్లు, ఎలక్ట్రిక్ బస్సులు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను ఎక్కువగా ఉపయోగించుకోవాలనిసూచించారు. సొంతకార్లు ఉన్నవారు కార్‌పూలింగ్ పద్ధతిని ప్రోత్సహించాలని, ఒకే వాహనంలో ఎక్కువ మంది ప్రయాణించాలని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచడంతో పాటు సరుకు రవాణాకు రోడ్డు మార్గాల కన్నా రైలు మార్గాన్ని ఎంచుకోవడం మంచిదని తెలిపారు. ఈ చిన్న చిన్న మార్పుల ద్వారా ప్రతి ఒక్కరూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావచ్చని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

**రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

అమరావతి,మే12 :ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.త్వరలో రాష్ట్రవ్యాప్తంగాఈ కొత్తవిధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

# కార్యసాధక హనుమ





రామాయణమహామాలా రత్నం వందే అనిలాత్మజమ్ -- అంటే, రామాయణమనే మహామాలలో రత్నమైన పవనసుతునికి నమస్కరిస్తున్నాను అని అర్థం. రామాయణంలో శ్రీరాముని తరువాత అంతటి ఉదాత్తమైన పాత్ర ఏదైనా ఉన్నదంటే, అది నిస్సందేహంగా ఆంజనేయుడిదే. బ్రహ్మదేవుడు, వాల్మీకి మహర్షి కలిసి హనుమంతుణ్ని సకల సద్గుణాల సమాహారంగా తీర్చిదిద్దారు. రాముడిలోనూ ఈ గుణాలన్నీ ఉన్నాయి. మరి, మారుతి పాత్ర ద్వారా మనకు లభించే ప్రత్యేకమైన సందేశం ఏమిటి?

రామాయణం ఆరంభంలోనే శ్రీరాముడు మహావిష్ణువు అవతారమని, రావణసంహారం కోసం భూమిపై అవతరించాడని స్పష్టంగా ఉంది. సృష్టి ఉన్నంతవరకు మానవజాతికి దిక్సూచిగా నిలవాలనే ఉద్దేశంతో రామాయణం, రాముడి పాత్రను తీర్చిదిద్దారు. కానీ భవిష్యత్తులో ఎవరైనా 'రాముడు దేవుడు కాబట్టి నియమనిష్ఠలతో జీవించగలిగాడు; మనబోటి మానవులకు అదెలా సాధ్యం?' అనే వాదనకు దిగవచ్చు. ఆ తర్కానికి తావుండకూడదనే మహదాశయంతోనే ఆంజనేయుడు ఆవిర్భవించాడని; ఇదంతా సృష్టికర్త వ్యూహరచనలో భాగమని పౌరాణికుల విశ్వాసం. ఒక వానరుడే అంతటి ఆదర్శవంతంగా జీవించగలిగితే, మానవుడైన నాకెందుకు సాధ్యం కాదు?- అన్న ఆత్మవిశ్వాసాన్ని మనలో కలిగించడమే హనుమంతుడి పాత్ర పరమార్థం.

రామనామం భక్తికి, ముక్తికి మార్గమైతే; ఆంజనేయుని అనుసరించటం భుక్తికీ మార్గమే! ఆంజనేయుణ్ని రామభక్తుడిగా మాత్రమే కాదు, ప్రస్తుత ప్రపంచానికి మార్గదర్శకునిగా కూడా చూడాలి. ఈరోజు మనం ఆధునిక భావజాలంగా తరచూ చర్చించుకునే వ్యాపార నిర్వహణ, పౌర సంబంధాలు, సిబ్బంది సంక్షేమం, దీర్ఘకాలిక దృష్టి, ప్రణాళికా రచన, మనస్తత్వ శాస్త్రం, వనరుల పొదుపు, పర్యావరణ పరిరక్షణ, అడ్డంకుల తొలగింపు వంటి విజ్ఞాన సర్వస్వాన్ని ఆంజనేయుడు ప్రబోధించలేదు; స్వయంగా ఆచరించి చూపాడు.

**వీరుడు మాత్రమే కాదు..:** అంజనాసుతుడి పేరు వినగానే అసంకల్పితంగా మన మదిలో మెదిలేవి- సుందరకాండ, సముద్ర లంఘనం, లంకాదహనం లాంటి అనితరసాధ్యమైన సాహసకృత్యాలే! బాల్యం నుంచే మనం వింటూ వస్తున్న- 'శాకినీ ఢాకినీ గాలి దెయ్యంబులన్, నీదు వాలంబులన్ జుట్టి నేలంబడంగొట్టి'- దండకం ద్వారా మారుతి దుష్టశక్తులకు సింహస్వప్నమని కూడా మనకు తెలుసు. కానీ హనుమంతుడు కేవలం శారీరక శక్తి, పరాక్రమాల ప్రతిరూపమే కాదు; దూరదృష్టి, విచక్షణ, కార్యదక్షత, సంయమనంతోపాటు వినయం కలగలిసిన పరిపూర్ణ వ్యక్తిత్వం.

**ఉద్యోగమంటే?:** రామాయణంలో హనుమంతుడి పాత్ర కిష్కింధకాండ ప్రారంభంలోనే తెరమీదకు వస్తుంది. సుగ్రీవుడు ప్రాణభయంతో వణికిపోతుంటే, వాయునందనుడు దైన్యాన్ని త్యజించి కర్తవ్యాన్ని ఆలోచించమంటూ మృదువుగా మందలిస్తాడు. సుగ్రీవుని మంత్రిగా తన బాధ్యతను నిర్వర్తించాడు గాని, కేవలం ప్రభువును తృప్తి పరచడమే తన పరమావధిగా భావించలేదు. ప్రస్తుత సమాజంలో అధికశాతం ఉద్యోగులు యజమానిని సంతోషపరచడానికే ప్రయత్నిస్తున్నారు. కటువైన మాటలు చెప్పైనా సరే- నాయకుణ్ని, తద్వారా సంస్థను సరైన గాడిలో పెట్టడం సభ్యులందరి బాధ్యత. దాన్ని సక్రమంగా నిర్వర్తించిన హనుమయ్యకు 'బుద్ధిమతాం వరిష్ఠం'- 'బుద్ధిమంతుల్లో శ్రేష్ఠుడు' అన్న విశేషణం అతికినట్లు సరిపోతుంది!

**వాక్కుతోనే విజయం:** అప్పుడైనా, ఇప్పుడైనా- సున్నితంగా, మర్యాదగా, సంక్షిప్తంగా, ఎదుటివారిని ఆకట్టుకునేలా మాట్లాడగలగడం ఒక అరుదైన కళ. భారతీయ సంప్రదాయంలోని చతుఃషష్టి కళలలో దీనికీ స్థానం ఉంది. అందులో హనుమంతుడు నిష్ణాతుడు. సీతను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న రామలక్ష్మణులు, గంధర్వుడి సూచన మేరకు సుగ్రీవుణ్ని అన్వేషిస్తూ రుష్యమూకం సమీపంలోని దట్టమైన అడవిలోకి ప్రవేశిస్తారు. హనుమంతుడు తొలిపరిచయంలోనే వారితో సత్సంబంధాన్ని ఏర్పరచుకుంటాడు. తనను, సుగ్రీవుణ్ని క్లుప్తంగా పరిచయం చేసుకుని, తన వాక్చాతుర్యంతో వారి విశ్వాసాన్ని చూరగొంటాడు.

ఎదుటివారి స్వభావాన్ని త్రుటిలో అంచనా వేయగలిగిన రాముణ్ని.. వాయునందనుడి సరస సంభాషణ ఎంతగానో ఆకట్టుకుంది. 'అతను వేదాలలో పాండిత్యం కలవాడు, వ్యాకరణంపై లోతైన పట్టున్నవాడు, సంస్కారవంతుడు అయి ఉండవచ్చ'ని లక్ష్మణునితో ప్రస్తావిస్తాడు రాముడు. ఇలాంటి దూత ఉన్న రాజు నిజంగా అదృష్టవంతుడని కొనియాడాడు. మితంగా మాట్లాడే రాముని నుంచి అంతటి ప్రశంస అందుకున్న హనుమయ్య సంభాషణా చాతుర్యం అనిర్వచనీయం. అనుమానం, భయం, ఆందోళనలతో కూడుకున్న పరిస్థితుల్లో- మొదటి పరిచయంలోనే ఎదుటివారి మనసును గెలుచుకునేలా మనలో ఎందరు అలా మాట్లాడగలుగుతారు?.. 'వాక్పటుత్వంచ హనూమత్ స్మరణాద్భవేత్!' హనుమను వేడుకుని, అటువంటి సంభాషణను అభ్యసిస్తే మనకూ అలాంటి వాక్చాతుర్యం ఎందుకు అలవడదు?

**వినయమే ఆ భూషణం:** 'అమానిత్వమదంభిత్వమహింసా క్షాంతిరార్జవం' అనే గీతాశ్లోకంలో పేర్కొన్న సుగుణాలలో 'అమానిత్వం', అంటే వినయం- ప్రప్రథమంగా కనిపిస్తుంది. రాముడికి దాసుడిగా తనను తాను పరమానందంగా పరిచయం చేసుకునే హనుమంతుడిలో వినయశీలత స్పష్టంగా గోచరిస్తుంది. దీనికి రామాయణంలో అనేక ఉదాహరణలు లభిస్తాయి. సీతాన్వేషణలో దక్షిణ దిక్కుకు వెళ్లిన వానరసేనకు, సీత సముద్రం అవతల లంకలో ఉన్నదనే విషయం తెలిసింది. అప్పుడో పెద్ద సమస్య ఎదురైంది. నూరు యోజనాల సముద్రాన్ని దాటగల సమర్థులెవరు? అంగదుడి ఆదేశం మేరకు గజుడు, గవాక్షుడు, సుషేణుడు వంటి వానరవీరులు తమ తమ బలాలను పేర్కొంటూ ఇరవై, ముప్పై, యాభై యోజనాలు దాటగలమని చెప్పారు. అంతకంటే ఎన్నో రెట్లు శక్తిసంపన్నుడైన పవనసుతుడు మాత్రం నిశ్శబ్దంగా ఉన్నాడు. చివరికి జాంబవంతుడు ప్రోత్సహించిన తరువాతనే మారుతి ముందుకు వచ్చాడు. ఉన్న గోరంత సామర్థ్యాన్ని కొండంతగా చెప్పుకొనే మనకు- హనుమంతుడంతటి వాడికి ఉన్న వినయంలో ఇసుమంతైనా ఉందా!

**ఆటంకాలను ఆదిలోనే..:** శతయోజన సముద్రాన్ని లంఘించగలిగినంత వేగంతో ఎగరాలంటే, కాళ్లతో అదమడానికి బలమైన ఆసరా కావాలి. అప్పుడే వేగం పుంజుకుంటుంది. సమీపంలో మహేంద్రగిరి పర్వతం ఉంది. కానీ, అది గుహలు, బిలమార్గాలతో నిండిపోయి డొల్లగా ఉంది. బలంగా అదమడానికి అనువుగా లేదు. సమయోచితంగా ఆలోచించిన హనుమంతుడు, ముందుగా తన బాహుబలంతో పర్వతశిఖరాలను గట్టిగా కుదిపాడు. ఆ గుహలన్నీ బండరాళ్లతో మూసుకుపోయి, పర్వతం దృఢమైన శిలగా మారిపోయింది. కేసరీసుతుడి కార్యం సుగమమైంది. ఏదైనా కార్యం ప్రారంభించేముందు, ఆ కార్యరంగం మనకు అనుకూలంగా ఉందో, లేదో గమనించాలి; లేకపోతే దానిని మనకు సానుకూలంగా మలచుకోవాలి. అప్పుడే లక్ష్యం సాకారమవుతుంది.

**ప్రలోభాలే ప్రమాదాలు:** సముద్రాన్ని అతివేగంగా లంఘిస్తున్న హనుమంతునికి మార్గమధ్యలో ప్రలోభాలు, పరీక్షలు ఎన్నో ఎదురయ్యాయి. కొంతదూరం ఎగిరిన తర్వాత మైనాకుడు అనే పర్వతరాజు సముద్ర ఉపరితలానికి ఎగసి వచ్చాడు. వాయుదేవుడు తనకు చేసిన సహాయానికి గుర్తుగా, వాయుపుత్రుణ్ని కొద్దిసేపు తన శిఖరంపై విశ్రాంతి తీసుకొమ్మని కోరాడు. కానీ, హనుమంతుడు అలసట తీర్చుకోవడం కోసం తన సమయాన్ని వెచ్చించలేదు. ఆతిథ్యాన్ని స్వీకరించమని అభ్యర్థించిన తన తండ్రి స్నేహితుడిని నిరుత్సాహపరచనూ లేదు. ఆ పర్వతాన్ని కృతజ్ఞతా పూర్వకంగా స్పృశించి ముందుకు సాగిపోయాడు. లక్ష్యసాధనలో ఎదురయ్యే తాత్కాలిక ఆకర్షణలకు లోను కాకుండా.. సాటి వారిపట్ల నొప్పించక, తానొవ్వక అన్నట్లుగా ప్రవర్తించాడు.

**ఉపాయంతో..:** మరికొంత దూరం సాగిన తరువాత నాగమాత సురస దేవతల ఆజ్ఞ మేరకు, హనుమంతుడి శక్తిని పరీక్షించదలచుకుంది. మార్గంలో అడ్డుగా నిలిచి, తన నోటిద్వారా ప్రవేశించి బయటికి రావాలని భీష్మించుకుంది. హనుమంతుడు యుక్తిగా ఆలోచించి, తనకున్న అణిమ అనే శక్తి ద్వారా సూక్ష్మరూపం ధరించాడు. సురస నోటిలోకి వేగంగా ప్రవేశించి వెనువెంటనే బయటికి వచ్చి తన ప్రయాణం కొనసాగించాడు. హనుమంతుడు తలచుకుంటే తనకు అడ్డుగా వచ్చిన సురసతో పోరాడి సులభంగా ఆమెను ఓడించగలడు. అయితే, అతనికి సురస ముఖంలో తనకు హాని చేసే సంకల్పం కనిపించకపోవడంతో, దండోపాయం ప్రయోగించలేదు; యుక్తితోనే అడ్డంకిని తొలగించుకున్నాడు. సాధ్యమైనంతవరకు ఉపాయంతోనే పనులు సాధించుకోవాలి; గత్యంతరం లేకపోతేనే ఘర్షణ మార్గాన్ని ఆశ్రయించాలి. కుటుంబంలో, సమాజంలో సత్సంబంధాలు కొనసాగించుకోవాలంటే ఇదే స్థిరమైన మార్గం.

**సాహసోపేత నిర్ణయాలు:** తన లక్ష్యానికి చేరువవుతున్న తరుణంలో హనుమ ప్రయాణానికి మరో విఘాతం ఏర్పడింది. సింహిక అనే భయంకరమైన సముద్రపు జంతువు హనుమంతుడి నీడను పట్టుకుని బలంగా నీటిలోకి లాగసాగింది. ఆ జలచరం గురించి ముందే తెలుసుకుని ఉన్న హనుమంతుడు సమయం వృథా చేయదలచుకోలేదు. సామ, దాన, భేదోపాయాలు పనికిరావని నిశ్చయించుకున్నాడు. ఒక్క క్షణంలో తన పదునైన గోర్లతో సింహిక ఉదరాన్ని చీల్చి తన మార్గాన్ని నిష్కంటకం చేసుకున్నాడు. అవసరమైన సందర్భాలలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేయడం ప్రమాదకరం.

వాయునందనుడు అన్ని విఘ్నాలను విజయవంతంగా అధిగమించి, శీఘ్రంగా నూరు యోజనాల సముద్రాన్ని దాటి లంకానగరాన్ని చేరుకున్నాడు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఘట్టంలో హనుమంతుడు చూపించిన తెగువ, సమయస్ఫూర్తి, కార్యకుశలత అసాధారణం. అవన్నీ వివరించాలంటే వాయుసుతుని వాలాన్నే మించిపోతాయి. ఏదైనా సన్నివేశం-సమస్య ఎదురైనప్పుడు ఆంజనేయుణ్ని భక్తితో తలచుకొని, ఇటువంటి పరిస్థితిలో ఆయనైతే ఏం చేసేవాడు? అని ప్రశ్నించుకుంటే సరైన సమాధానం సత్వరమే లభిస్తుంది.

ఆంజనేయుడి అనుగ్రహం పొందడానికి సులభమైన మార్గం కూడా ఉంది- 'యత్ర యత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిం..' రామనామాన్ని జపిస్తే చాలు; ఆ రామదూత హనుమంతుడే స్వయంగా వచ్చి మన కష్టాలను కడతేర్చుతాడు.

# అన్నా డిఎంకెలో లుకలుకలు



## పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు
## టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం

చెన్నై, మే12 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొన్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

# పాశ్చత్య సంస్కృతిని విడనాడి హైందవ సంస్కృతిని పాటించాలి: చెన్న మల్లికార్జున



రాయికోడ్:మే 12(తెలంగాణ వాణి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోహాహొహిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి వారిలో చైతన్యం నింపాలనే ఉద్దేశ్యంతో సోమవారం సాయంత్రం ఘనంగా హిందూ సమ్మేళనంను నిర్వహించడం జరిగింది.ముందుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి చెన్న మల్లిఖార్జున స్వామి,ముఖ్య వక్తలుగా విచ్చేసిన పట్లోళ్ల సంగీత లక్ష్మి (లెక్చరర్),పట్లోళ్ల మురళీధర్ రెడ్డి(ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ మరియు తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్) భారతమాత చిత్రపటానికి పూజాకార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన గావించారు.ఈ సందర్భంగా వక్త పట్లోళ్ల సంగీత లక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరు మన హిందు ధర్మాన్ని పాటిస్తూ తమ బాధ్యతగా పంచ పరివర్తన్(5 పనులను) చేయాలని వాటి గురించి వివరిస్తూ మొదటగా సమాజంలోని హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన ధర్మ సంరక్షణ కోసం పాటుపడేవిధంగా చైతన్యం నింపాలని, రెండు స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని, మూడు కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా అందరూ ఉమ్మడి కుటుంబంగా వుండాలని, నాలుగవ పని పౌర హక్కులను అనగా రూల్స్ ను తూచా తప్పకుండా పాటించాలని, ఐదవ పని పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అలాగే పురుగు మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం చేస్తూ భూమిని కాపాడాలని,ప్రకృతిని కాపాడేందుకు చెట్లను పెంచి వాటి పెరుగుదలకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వక్త పట్లోళ్ల మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన సనాతన ధర్మాన్ని పాటిచాలనే ఉద్యేశంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను 1925 విజయదశమి పర్వదినాన డాక్టర్ కేశవరావు బలిరామ్ పంత్ హెడ్గేవార్ మహారాష్ట్రలోని నాగపూర్ లో కొద్దిమందితో స్థాపించి నేడు లక్షల మంది స్వయంసేవకులు హిందూ ధర్మం కోసం పాటుపడుతూ, వరదలు వచ్చిన చోట మరియు ఆపద సమయాన స్వచ్ఛందంగా వివిధ రకాల సేవ కార్యక్రమాలు చేస్తున్న సంస్థ ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. అలాగే దశాబ్దాల చరిత్ర కలిగిన మన సనాతన హైందవ సంస్కృతిలో భాగంగా గతంలో అందరూ హిందూ ధర్మాన్ని పాటిస్తూ కట్టుబొట్టు, నడవడిక, ఇతరులపై గౌరవ మర్యాదలు కలిగి ఉండేవారని కానీ నేడు విదేశీ సంస్కృతిని పాటిస్తూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడం,సభ్యసమాజం తలదించుకునేలా వస్త్రధారణ, తల్లిదండ్రులు, గురువులను, పెద్దలను గౌరవం ఇవ్వకుండా ప్రవర్తించడం సిగ్గు చేటు అని తెలుపుతూ ఇప్పటికైనా పాశ్చత్య సంస్కృతిని విడనాడాలని సూచించారు. ముఖ్య అతిథి చెన్న మల్లిఖార్జున స్వామి మాట్లాడుతూ మన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేస్తూ మన దేశాన్ని, ధర్మాన్ని కాపాడాల్సి వచ్చినప్పుడు ముందు ఉండాలి అని అలాగే అందరూ భగవంతుని నామస్మరణతో భక్తి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

# బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలి

## బండి భగీరథ ను తక్షణమే అరెస్టు చేయాలి
## ప్రగతి శిలా మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంపంగి పద్మక్క డిమాండ్



హైద్రాబాద్ మే 12 ;బాలీ కాకు మద్యం తాగించి లైంగికదాడికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు,బండి సాయి భగీరథ ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రగతి శిలా మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంపంగి పద్మక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బాధిత కుటుంబ పై తప్పుడు కేసు పెట్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ను తక్షణమే బర్త్ రఫ్ చేయాలి అని డిమాండ్ చేశారు బదిరాలి పిర్యాదు స్వీకరించడంలో పోలీసులకు 8గల టైమ్ పట్టింది,దిన్ని బట్టి పోలీసుల వైఖరి ఏమిటో అర్థం అవుతుంది,చట్టం ముందు అందరూ సమానమే ,అనే రాజ్యాంగ పరిధిలో పోలీస్ కూడా ఉండాలన్నారు. బండి భగీరథ తన తండ్రి అండతో విద్యా సంస్థలో,ర్యాగింగ్,దాడులు, మద్యం,మత్తులో అనేక అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాలిక పై లైంగిక దాడి చేయడమే కాకుండా తమను హాని ట్రాప్ చేశారని కేసును తప్పు దోవ పట్టిస్తున్నారు అని విమర్శించారు. బే టీ బచావో, బే టీ పడవు వంటి అనేక నినాదాలు ఈ స్తున్న బీజేపీ సంస్కారం,రేపిస్టులకు సత్కారాలు చేయడంలోనే వీరి ప్రబుద్ధి తెలుస్తుంది, కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవిని ఉపయోగించు కొని కేసును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు,బాధిత కుటుంబ న్నీ బెదిరిస్తున్నారని,బాలికకు ప్రాణహాని పొంచి ఉందన్నారు. తక్షణమే సాయి భగీరథ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు తుమ్మల

## తుమ్మలతో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిది
## సీనియర్ జర్నలిస్ట్ మోటమర్రి రామకృష్ణ

కొత్తగూడెం (తెలంగాణ వాణి) ఉమ్మడి ఖమ్మం జిల్లాను విశేషంగా అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిదని సీనియర్ జర్నలిస్ట్ మోటమర్రి రామకృష్ణ స్పష్టం చేశారు. 1984 నుంచి ఖమ్మం జిల్లా కేంద్రంలో పనిచేసిన జర్నలిస్టులందరికీ తుమ్మల నాగేశ్వరరావు సుపరిచితులని, ఆయనకు జర్నలిస్టుల పట్ల ఎంతో గౌరవభావం ఉండేదని తెలిపారు.1985 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్టీ రామారావు సత్తుపల్లి వచ్చి ప్రజాసేవ చేయాలనే సంకల్పం గల విద్యావంతుడైన యువకుడిని తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశానని, ప్రజలు తప్పనిసరిగా గెలిపించాలని కోరుతూ తుమ్మల నాగేశ్వరరావును నియోజవర్గ ప్రజలకు పరిచయం చేశారన్నారు. ఆ సన్నివేశం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. అప్పటి నుంచి ఆయన తనకు బాగా తెలుసునని ఆ మధుర జ్ఞాపకాలను రామకృష్ణ నెమరువేసుకున్నారు. ప్రజా సేవే పరమావధిగా రాజకీయాలలో ప్రవేశించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి పథకాలను కార్యక్రమాలను చేపట్టిన తుమ్మల అభినందనీయుడని ప్రశంసించారు.1986 నుంచి నేటి వరకు నాలుగు సార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను స్వీకరించి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేశారని ఆయన కొనియాడారు. నిజాయితీకి ప్రతిరూపంగా తుమ్మల ప్రజలలో పేరు పొందారని, అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు విశేష సేవలు అందించారని, ఎన్నో విజయాలను సాధించిన ఆయన రాజకీయ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు.

గతంలో ఖమ్మం జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతంలో గల గుండాల మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత తుమ్మలకే దక్కుతుందని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం లలో జర్నలిస్టుగా పనిచేస్తున్న సందర్భంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్నో కార్యక్రమాలకు, సమావేశాలకు తాను హాజరయ్యానని, ఆ రోజులు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. జర్నలిస్టుగా తనకు ఆయనంటే ఎంతో గౌరవం అని, మానవత్వం తొణికిసలాడే హృదయం ఉన్న సహృదయుడు తుమ్మల అని కొనియాడారు. కాలగమనంలో నాలుగు దశాబ్దాలు గడిచిపోయినా అప్పట్లో ఖమ్మంలో నాగేశ్వరరావు చెరగని ముద్ర వేశారని అది నేటికీ స్ఫూర్తినిస్తోందని తెలియజేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిష్కళంక ప్రజానాయకుడైన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ప్రజలకు విశేషంగా సేవ చేయుటకు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యములను ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# పెళ్లిపై ఫరియా అబ్దుల్లా ఇంట్రెస్టింగ్ కామెంట్స్..



ఫరియా అబ్దుల్లా.. 'జాతిరత్నాలు' సినిమాలో చిట్టి పాత్రతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ మరోసారి తన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన చలాకీతనం, కామెడీ టైమింగ్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. తాజాగా ప్రేమ, పెళ్లి, జీవితంపై తన అభిప్రాయాలను పంచుకుని ఆసక్తికర చర్చకు తెరలేపింది. పెళ్లి గురించి మాట్లాడుతూ ఫరియా చాలా భిన్నమైన ఆలోచనలు వ్యక్తం చేసింది. తన దృష్టిలో ప్రేమ, వివాహం రెండూ వేర్వేరు అంశాలని ఆమె చెప్పింది. మనల్ని ఎవరైనా ప్రేమిస్తున్నారనే భావన చాలా అద్భుతంగా ఉంటుంది. జీవితంలో ఒక తోడు ఉండటం కూడా అవసరమే. కానీ పెళ్లి అనేది ఒక మనిషిని పూర్తిగా మార్చే బంధం. ఇప్పుడు యువతలో వివాహంపై ఆసక్తి తగ్గిపోతోంది. రాబోయే రోజుల్లో పెళ్లి అనే మాటకు అర్థమే మారిపోయే అవకాశం ఉంది" అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుత ఈ తరం రిలేషన్‌షిప్స్‌ను చూసే విధానం పూర్తిగా మారిపోయిందని ఫరియా అభిప్రాయపడింది. స్వేచ్ఛ, వ్యక్తిగత స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న యువత.. సంప్రదాయ బంధాలపై అంత ఆసక్తి చూపించడం లేదని ఆమె విశ్లేషించింది. దీంతో ఆమె వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా ఫరియా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒకవేళ తాను హీరోయిన్ కాలేదంటే.. పెద్ద క్రూయిజ్ షిప్‌లో చెఫ్‌గా పనిచేసేదాన్నని లేదా ఈవెంట్ మేనేజర్‌గా కెరీర్ కొనసాగించేదాన్నని తెలిపింది. ట్రావెలింగ్ అంటే తనకు చాలా ఇష్టమని, ట్రావెల్ వ్లాగర్‌గా కూడా మారే అవకాశం ఉండేదని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఫరియా అబ్దుల్లా కేవలం నటి మాత్రమే కాదు.. మంచి డ్యాన్సర్, రచయిత్రి కూడా. హైదరాబాద్‌లోని లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ చదువుతున్న సమయంలో ఆమె ప్రతిభను దర్శకుడు నాగ్ అశ్విన్ గుర్తించారు. ఆ తర్వాత ఆడిషన్ ద్వారా జాతిరత్నాలు సినిమాలో అవకాశం దక్కించుకుని ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. సోషల్ మీడియాలో వచ్చే రూమర్లను పెద్దగా పట్టించుకోనని, మంచి కథలు, బలమైన పాత్రలే తనకు ముఖ్యమని ఫరియా స్పష్టం చేసింది. పాత్ర చిన్నదైనా.. క్యారెక్టర్ డిజైన్ బాగుంటే నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పి తన వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటుకుంది.




# 'పెద్ది' ట్రైలర్‌కు భారీ ప్లాన్..




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ఈ భారీ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకురాగా.. ఇప్పుడు ట్రైలర్‌కు సంబంధించిన తాజా అప్డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'పెద్ది' సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. దీంతో అభిమానులు సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు "చికిరి చికిరి", "రయ్ రయ్ రారా" పాటలు సోషల్ మీడియాలో మంచి స్పందన దక్కించుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా విజువల్స్, రామ్ చరణ్ మాస్ లుక్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'పెద్ది' ట్రైలర్‌ను మే 16న విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. అంతేకాదు, ఈ ట్రైలర్ లాంచ్‌ను చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో భారీ ఈవెంట్ నిర్వహించి ట్రైలర్‌ను విడుదల చేయనున్నారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతోనే నార్త్ ఇండియాలో ఈ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా 1980ల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో రామ్ చరణ్ ఇప్పటివరకు కనిపించని రగ్గడ్, డీ-గ్లామర్ లుక్‌లో కనిపించబోతున్నారు. పహిల్వాన్ తరహా పవర్‌ఫుల్ పాత్రలో ఆయన నటిస్తున్నారనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు పెంచింది. సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణం, ఎమోషనల్ కథ, గ్రామీణ బ్యాక్‌డ్రాప్ సినిమాపై అన్ని భాషల్లోనూ మంచి బజ్‌ను తీసుకొచ్చాయి. ఇక సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందిస్తున్న సంగీతం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా మారింది. ఇప్పటికే విడుదలైన పాటలకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే.. ఆడియో పరంగా కూడా 'పెద్ది' భారీ విజయాన్ని అందుకునేలా కనిపిస్తోంది. పాన్ ఇండియా రిలీజ్‌ను దృష్టిలో పెట్టుకుని మూవీ టీమ్ ఉత్తర భారతదేశంలో కూడా ప్రత్యేక ప్రమోషనల్ ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అభిమానులంతా మే 16 ట్రైలర్ అప్డేట్ అధికారికంగా ఎప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'వీరభద్రుడు'తో మాస్ కంబ్యాక్‌కు సూర్య రెడీ..



తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'వీరభద్రుడు' మరో మూడు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళనాడులో ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా సినిమా విడుదలపై కొంత సందిగ్ధత నెలకొన్నప్పటికీ, చివరికి మేకర్స్ ముందుగా ప్రకటించిన తేదీకే రిలీజ్ చేయాలని ఫైనల్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సూర్య అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యతో పాటు ఆయన తమ్ముడు, హీరో కార్తీ కూడా హాజరయ్యారు. తెలుగు మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టే ఈ స్టార్ బ్రదర్స్, టైమ్ తక్కువగా ఉండటంతో ఒకే ఈవెంట్ ద్వారా సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసే ప్రయత్నం చేశారు. ఇక తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది కోర్ట్‌రూమ్ డ్రామా, యాక్షన్, ఎమోషన్స్ కలగలిసిన కథగా కనిపిస్తోంది. రౌడీ లాయర్లను ఉపయోగిస్తూ కోర్టును తన ఆధీనంలో నడిపించే దుర్మార్గుడు బేబీ కృష్ణ పాత్రలో ఆర్జే బాలాజీ కనిపించగా, అమాయక తండ్రి కూతురికి న్యాయం చేస్తానని చెప్పి చివరకు మోసం చేసే వ్యక్తిగా ఆయన పాత్ర నెగటివ్ షేడ్స్‌లో ఉంది. అలాంటి సమయంలో న్యాయం కోసం తిరిగి రంగంలోకి దిగే వీరభద్ర పాత్రలో సూర్య పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఒకప్పుడు నల్లకోటు వదిలేసిన ఆయన, అన్యాయాన్ని ఎదిరించేందుకు మళ్లీ కోర్టులో అడుగుపెడతాడు. అయితే ఈసారి కేవలం వాదనలు మాత్రమే కాదు, అవసరమైతే కత్తి పట్టుకుని శత్రువులను ఎదుర్కొనేంత ఆగ్రహంతో ఆయన పాత్రను డిజైన్ చేసినట్లు ట్రైలర్‌లో చూపించారు. కథ పరంగా పెద్దగా కొత్తదనం కనిపించకపోయినా, బాలీవుడ్‌లో వచ్చిన జాలీ ఎల్ఎల్‌బీ తరహా కోర్ట్‌రూమ్ వైబ్‌ను మాస్ ఎలిమెంట్స్‌తో మిక్స్ చేసినట్లు అనిపిస్తోంది. అదే సమయంలో దైవత్వానికి సంబంధించిన అంశాలు కూడా కథలో కీలకంగా ఉండబోతున్నట్లు హింట్ ఇచ్చారు. ట్రైలర్ చివర్లో కనిపించిన తెల్ల మీసాల వృద్ధుడి షాట్ వెనుక ఓ కీలక సస్పెన్స్ దాచినట్లు తెలుస్తోంది. సినిమాకు సంగీతం అందించిన సాయి అభ్యంకర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన బలం అయింది. హీరోయిన్‌గా త్రిష కృష్ణన్ నటిస్తుండగా, ట్రైలర్‌లో ఆమెను కొన్ని కీలక సన్నివేశాల్లో మాత్రమే చూపించారు. ఇక బాక్సాఫీస్ పరంగా చూస్తే 'వీరభద్రుడు'కు మంచి అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి తర్వాత తెలుగులో పెద్ద స్టార్ హీరో కమర్షియల్ సినిమా పెద్దగా రాకపోవడం ఈ చిత్రానికి ప్లస్ అయ్యే అవకాశముంది. ఇటీవల వచ్చిన ఉస్తాద్ భగత్ సింగ్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో ట్రేడ్ కూడా కొత్త భారీ సినిమాకోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం చెప్పుకోదగ్గ పోటీ కూడా లేకపోవడంతో, సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే సూర్యకు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఓపెనింగ్స్ రావడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ రూపొందించిన ఈ చిత్రం సూర్యకు బలమైన కంబ్యాక్ ఇస్తుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# హీరోయిన్ దాంపత్య జీవితంలో చీలికలు

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విడాకుల ప్రచారం



బాలీవుడ్ టెలివిజన్ రంగంలో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకున్న మౌనీ రాయ్ గత కొన్నేళ్లుగా సినీ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. టెలివిజన్ సీరియల్స్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత పలు హిందీ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర', 'రోమియో అక్బర్ వాల్టర్' చిత్రాలతో మంచి గుర్తింపు దక్కించుకుంది. అయితే ప్రస్తుతం మౌనీ రాయ్ వ్యక్తిగత జీవితం మళ్లీ వార్తల్లో నిలిచింది. ఆమె తన భర్త సూరజ్ నంబియార్‌తో విడాకులు తీసుకోబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపిస్తోంది. మౌనీ రాయ్, సూరజ్ నంబియార్‌లు కొంతకాలం ప్రేమలో ఉన్న తర్వాత 2022 జనవరి 27న గోవాలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. బెంగాలీ, మలయాళ సంప్రదాయాల ప్రకారం జరిగిన ఈ పెళ్లి అప్పట్లో భారీ చర్చకు దారితీసింది. సినీ ప్రముఖులు, సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇటీవల మౌనీ రాయ్, సూరజ్ నంబియార్ ఇద్దరూ సామాజిక మాధ్యమాల్లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసినట్లు నెటిజన్లు గుర్తించారు. అంతేకాదు, తమ పెళ్లికి సంబంధించిన ఫోటోలను కూడా ఖాతాల నుంచి తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన చిన్న మార్పులే పెద్ద చర్చలకు దారి తీస్తుంటాయి. ఈ నేపథ్యంలో మౌనీ చేసిన ఈ పని అభిమానుల్లో అనుమానాలకు కారణమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "అధికారిక ప్రకటన వచ్చే వరకు నమ్మలేం" అని కొందరు వ్యాఖ్యానిస్తుండగా, "ఇద్దరి మధ్య నిజంగానే ఏదో సమస్య ఉన్నట్టే కనిపిస్తోంది" అంటూ మరికొందరు చర్చిస్తున్నారు. మౌనీ రాయ్ తరచూ తన భర్తతో కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలు పంచుకునేది. అలాంటిది ఆమె ఒక్కసారిగా ఆ జ్ఞాపకాలను తొలగించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు మౌనీ రాయ్ లేదా సూరజ్ నంబియార్ ఈ ప్రచారంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో నిజంగానే వారి దాంపత్య జీవితంలో విభేదాలు వచ్చాయా? లేక ఇది కేవలం సామాజిక మాధ్యమాల ఊహాగానమా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో

మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్‌కికాసర్ల శ్యామ్




లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.



# బెల్టు జోరు!

## బార్లను తలపిస్తున్న బెల్ట్ షాపులు

మిర్యాలగూడ : మద్యం బెల్ట్ షాపులు అంటే నామమాత్రంగా ఇంట్లో నడిపిస్తుంటారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రాంతాలలో బెల్ట్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి లైసెన్సు తీసుకున్న బార్ల కంటే బెల్ట్ షాప్ లోనే మద్యం విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో మిర్యాలగూడ పట్టణంలోని బెల్ట్ షాప్ ల వ్యాపారం మూడు బీరు బాటిల్లు.. ఆరు ఫుల్ బాటిల్లు అన్న చందంగా వ్యాపారం కొనసాగుతుంది. బెల్ట్ షాపులలో ఏసీలను పెట్టి నిర్వహిస్తున్నారు. పేరుకు హోటల్ పేరు పెడుతూ మద్యం విక్రయిస్తూ అక్రమమార్జనకు పాల్పడుతున్నారు. నాన్ వెజ్ తో పాటు పలు రకాల వంటకాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియులను ఆకర్షిస్తున్నారు. దీంతోపాటు బెల్టు షాపులలో జోరుగా ఐపీఎల్ బెట్టింగ్ వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బహిరంగంగా బెల్ట్ షాప్ లలో మద్యం విక్రయిస్తున్న పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నెలవారి మామూలు తీసుకొని సాయ సహకారాలు అందిస్తున్నారు.

ఏసీ రూములతో నిర్వహణ: మిర్యాలగూడ పట్టణంలోని పలుచోట్ల బెల్ట్ షాపుల నిర్వహించేవారు ఏసీ రూములను ఏర్పాటు చేస్తున్నారు. కిరాణం షాపులలో మద్యం అమ్మడానికి అనుమతులు లేని చోట కూడా ఏకంగా ఏసీ రూములను ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఏసీ రూముల పేరుతో ఫుల్ బాటిల్ కు 120 రూపాయలు అదనంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏసీ పేరు చెప్పి మందు ప్రియుల జేబులకు చిల్లు పెడుతున్నారు. హోటల్ పేరు, కిరాణం షాపు పేర్లు పెట్టి బెల్ట్ షాపులను నడుపుతున్నారు. హోటల్ పేరుతో వివిధ రకాల మాంసాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అధిక ధరలకు మద్యం విక్రయం: బెల్ట్ షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని బెల్ట్ షాపులలో ఏసీ రూమ్లను ఏర్పాటు చేసి క్వార్టర్ కు 40 రూపాయలు చొప్పున ఫుల్ బాటిల్ కి 120 రూపాయలు, ఒక బీరు బాటిల్ పై 30 రూపాయల చొప్పున అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతోపాటు 13 రూపాయల వాటర్ బాటిల్ ను 25 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ ఆరోపణలు: మిర్యాలగూడ పట్టణంలో ఎక్కువగా హోటల్ తో పాటు బెల్టు షాపులలో ఐపీఎల్ బెట్టింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేసవికాలం కావడంతోపాటు ఏసీ రూముల నిర్వహణ వలన ఐపిఎల్ బెట్టింగ్ అనుకూలంగా ఏర్పాట్లు చేసి మద్యం తో పాటు బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో గోవా క్యాష్ నోవా తరహాలో బెట్టింగ్ నిర్వహిస్తున్న పలువురుని పోలీసుల అరెస్టు చేశారు.

పట్టించుకోని అధికారులు: బెల్ట్ షాపులలో బెట్టింగ్ నిర్వహిస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం లోని ఎక్కువగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలలోని ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బెల్ట్ షాప్ ల నుంచి నెలవారి మామూలు తీసుకొని నిర్వాహకులకు సహకరిస్తున్నట్లు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో భారీగా బెల్ట్ షాపులు నిర్వహణ జరుగుతున్న పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు నెలకు 35 వేల రూపాయల చొప్పున మామూలు వసూలు చేసి చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపులపై నిఘా ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కొల్లాపూర్‌లో బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి



కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతల రవాణా కష్టాలు ఇక తీరనున్నాయి. వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణం (బస్టాండ్) నుంచి రామాపురం శివారులో ఉన్న మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి వెళ్లేందుకు రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ వాహనాన్ని సమకూర్చారు. హైదరాబాద్‌కు చెందిన 'గుడ్ యూనివర్స్' సామాజిక సేవా సంస్థ, 'ఆర్సేసియం' సంస్థల సహకారంతో ఈ పర్యావరణహిత వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఈ ఉ చిత రవాణా సౌకర్యం ఎంతో ఊరటనిస్తుందన్నారు. సురక్షిత మైన, సులభతరమైన ప్రయాణాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను మంత్రి జూపల్లి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని నడిపారు. ఈ కార్యక్రమ ంలో సంస్థ ప్రతినిధులు అనుష్క, వంశీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం, కౌన్సిలర్లు సుజాత, కర్ని శివ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బలం, ధైర్యం, భక్తి, వినయం కలిసిన రూపం హనుమంతుడు

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్ మే 12 (తెలంగాణ వాణి): జీడిమెట్ల డివిజన్లలోని వివిధ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ , ముఖ్యఅతిథిగా హాజరై పరాక్రమశాలి హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రసన్న నగర్ కోదండ రామాలయంలో ప్రసన్న నగర్ కోదండ రామాలయంలో నిర్వహించిన దేవాలయ వార్షికోత్సవ , హనుమాన్ జయంతి వేడుకలల్లో పాల్గొన్న బిఆర్ ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే . వి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సిద్ధులు గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, సభ్యులు నాగచంద్రారెడ్డి, నాగార్జున, నారాయణ, దేవాలయ కమిటీ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి మారయ్య బాబు మారయ్య బాబు, ముఖ్య సలహాదారులు నాగేంద్ర బాబు తదితరులు పాల్గొనగా... ఎం.ఎన్.రెడ్డి నగర్ లో. ఎమ్ రెడ్డి నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే , పవన సుత హనుమాన్కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్నే శ్యామ్, సభ్యులు ఎలా గౌడ్, విటల్ నాయక్, బాలచందర్, సత్యనారాయణ, కుమార్, రాహుల్, నరేష్, సందీప్, కిరణ్ తదితరులు త్బుల్లాపూర్ వేణుగోపాల స్వామి దేవాలయంలో... కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ , ముఖ్యఆతిథిగా హాజరై రామ భక్త హనుమాన్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జిట్టా రామేశ్వర్ రెడ్డి, సభ్యులు కమలాకర్ గౌడ్, కుల్ఫీ వెంకటేష్, కుంటా వేణు, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారానికి పాల్పడిన భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలి

**అధికార గర్వంతో అరాచకాలకు పాల్పడటం హేయమైన చర్య**

**మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి**

**మహిళల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి**

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన**





కొత్తగూడెం (తెలంగాణ వాణి): మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) డిమాండ్ చేసింది. మంగళవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఈ మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి మాట్లాడుతూ.. అధికార బలంతో మైనర్ బాలికల జీవితాలతో ఆడుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడైనంత మాత్రాన చట్టం చుట్టం కాకూడదని, కేసును నీరుగార్చేందుకు పాలక పక్షాలు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉ ంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళా రక్షణ ప్రశ్నార్థకంగా మారిందని, నిర్భయ వంటి చట్టాలు ఉన్నా కామాంధుల్లో భయం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రత్న కుమారి, షేక్ షాహిన్, కైసార్, పోలుమోరి ధనలక్ష్మి, మునిగడప పద్మ, గోనె మని, మంద నిర్మల, గాయిత్రి, శాంతి, బుజ్జమ్మ, సునీత, లత, మద్దినేని నాగమణి, దార్ల లక్ష్మి, సరోజ, రమ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం

### బండి భగీరథ్ పై కఠిన చర్యలు తీసుకోవాలి
### - ఎస్ ఎఫ్ ఐ డిమాండ్





హనుమకొండ (కాకతీయ యూనివర్సిటీ) తెలంగాణ వాణి: ఈరోజు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేయూ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు బిజెపి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరద్ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ ఈనెల ఎనిమిది న భాదిత మహిళ బండి భగీరద్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయించిన ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా పెద్దలకు చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా బాధిత మహిళను హనీ ట్రాప్ పేరుతో మహిళలకు మచ్చ తేవడం బిజెపికి అలవాటేనని విమర్శించారు. మరియు బండి భగీరథ పై పోక్సో కేసు నమోదు చేసి నాలుగు రోజులు గడుస్తున్న ఇప్పటికి ఆయనను అరెస్టు చేయకపోవడం లోని అంతర్యం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే బండి భగీరద్ నీ అరెస్టు చేసి పదిహేడేళ్ల ఏళ్ల బాలికకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందనీ. అదేవిధంగా కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ నీ బర్త్ రఫ్ చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్, బిరెడ్డి జస్వంత్, కమిటీ సభ్యులు మల్లేష్, సూరజ్, పవన్, నాగరాజు, అభిషేక్, అనూఫ్, తదితరులు పాల్గొన్నారు .

## హనుమాన్ ఆలయంలో జయంతి వేడుక



మహాదేవపూర్ మే 12 (తెలంగాణ వాణి) కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన కట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ అర్చక స్వాములు స్వామి వార్లకు చందనం, తైలాభిషేకం,అభిషేకాలు నిర్వహించి, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. వడపప్పు, బెల్లం పాయసం నైవేద్యాలుగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజలు



తెల్లాపూర్ మే 12 : (తెలంగాణ వాణి ప్రతినిధి): తెల్లాపూర్ – కొల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా పంచముఖ ఆంజనేయ స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పంచామృత అభిషేకం నిర్వహించి అనంతరం సింధూర అర్చన, విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు నిధులు లేవా



**- మిషన్ భగీరథ పథకం అమలులో ప్రభుత్వం విఫలం**

**- నిధుల కొరత సాకుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు**

**- తాగునీటి సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించాలి**

**- సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం**

**- నీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

కొత్తగూడెం (తెలంగాణ వాణి) ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకం పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన నిలదీశారు. నీటి సమస్య పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలు అల్లాడకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అయితే ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేశ్, శివయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో పూజలు

### డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల దంపతులు



పాల్వంచ (తెలంగాణ వాణి): హనుమాన్ జయంతి హనుమంతునికి ప్రీతిపాత్రమైన మంగళవారం రాగా, మంగళవారం పలు దేవాలయాల్లో జరిగిన పూజల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని, పూజలు చేశారు. పాల్వంచ పట్టణ పరిధి పాత పాల్వంచలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, బొల్లోరిగూడెంలోని రామాలయంలో, అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలోని హనుమాన్ గుడిలో జరిగిన ప్రత్యేక పూజల్లో కొత్వాల దంపతులులి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయ నిర్వాహకులు కొత్వాల దంపతులను శాలువాతో సత్కరించారు. అయ్యప్పస్వామి దేవాలయంలో సుమారు వెయ్యి మంది భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల ప్రారంభించారు. హనుమాన్ జయంతి సందర్భంగా సుమారు వెయ్యి మంది భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని కొత్వాల భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమాల్లోకార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, అయ్యప్పస్వామి దేవాలయం పూజారి బృందావనం నరసింహమూర్తి, కనగాల రాంబాబు, బేతంశెట్టి వెంకట్, భట్టు మంజుల, బ్యాంకు చారీ, కేశబోయిన కోటేశ్వరరావు, బాడిశ శంకరరావు, గల్ల శోభన్ బాబు, హర్షవర్ధన్, సుంకర వీరభద్రం, కృష్ణ, ప్రసాద్, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com